RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త


తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 303 గురువారం 27 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## బంగ్లాదేశ్ ఎగుమతులు భారత్ నుంచి వెళ్లకుండా నిషేధం

న్యూఢిల్లీ : భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలకు సరుకులు ఎగుమతి చేసుకునేలా బంగ్లాదేశ్‌కు గతంలో ఇచ్చిన వెసులు బాటు(ట్రాన్స్‌షిపమెంట్)ను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. బంగ్లాదేశ్ ఎగుమతులేవీ భారతదేశం గుండా వేరే దేశాలకు వెళ్లకుండా పూర్తిగా నిషేధం విధించింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. బంగ్లాదేశ్‌కు ట్రాన్స్‌షిపమెంట్ వెసులుబాటు కల్పిస్తూ 2020 జూన్ 29న భారత్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. బంగ్లాదేశ్ తమ ఉత్పత్తులను భారత్‌లోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టుల ద్వారా వేరే దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు.



## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్‌కు రూ.7,280 కోట్లు కేటాయించిందని తెలిపారు. పుణె నగరంలో మెట్రో రైలు పొడిగింపునకు రూ.9,858 కోట్లు కేటాయించినట్లు వివరించారు. దేవభూమి ద్వారక – కర్నాలస్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అందుకు రూ.1,457 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. బద్లాపూర్ – కర్జాత్ థర్డ్, ఫోర్త్ రైల్వే పనులకు సైతం అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఈ రోజు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19, 919 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తవుతాయని మంత్రి అశ్విని వైష్ణవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ముంబై సమీపంలోని బద్లాపూర్ – కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్‌లకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు ద్వారా లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్ష ప్రయోజం చేకూరుతుందన్నారు. అలాగే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు.

పుణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనుందన్నారు. దీని ద్వారా 32 కిలోమీటర్ల మేర కొత్త లైన్ వేసేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్గం ఖరడి నుంచి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుంచి మాణిక్ బాగ్ వరకు ఈ మెట్ర రైలు నడవనుందన్నారు. ట్రాఫిక్ జామ్‌తో నిత్య నరకం చూస్తున్న పుణే వాసులకు ఇది పెద్ద ఉపశమనం కలిగిస్తుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించి.. స్వదేశంలోనే దీనిని అభివృద్ధి చేసుకునే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. దాంతో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు ప్రధాని మోదీ : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా కేంద్రమంత్రుల్ని ఆహ్వానించాలని సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రమంత్రులు, ఉన్నతాధికారులకు సూచించారు. రాష్ట్రంలో డిసెంబర్ 8,9 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ సమ్మిట్ పై బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్, పొన్నం ప్రభాకర్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు ఉన్నత అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ కు దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించేందుకు ముందుగానే లిస్ట్ రెడీ చేయాలని అధికారులకు సూచించారు. సదస్సుకు హాజరయ్యే అతిథులకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే 2600 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు పంపినట్లు అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసే స్టాల్స్ డిజైన్లను చూపించారు. పెట్టుబడులకు సంబంధించి సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. విభాగాల వారిగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను కూడా రెడీ చేయాలని, వారికి ఇచ్చే సమయాన్ని ముందే ఫిక్స్ చేసి ప్రోగ్రామింగ్ చేయాలని సూచించారు. సమ్మిట్ లో జరిగే ఒక్కో ఈవెంట్ కు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని బాధ్యుడిగా నియమించాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమం, పరిశ్రమలు, వైద్య రంగాలకు సంబంధించిన స్టాళ్ల ఏర్పాటులో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమ్మిట్ సందర్భంగా ప్రదర్శించే డ్రోన్ షో తెలంగాణ బ్రాండ్ ఇమేజీని పెంచే విధంగా ఉండాలని, అదే రీతిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సదస్సుకు సంబంధించి అన్ని డిజైన్లు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# బెంగాల్‌పై బీజేపీ ఫోకస్!

# భారీ స్కెచ్ సిద్ధం!




## 5 జోన్లుగా విభజన... 12 మంది నాయకులకు ప్రచార బాధ్యతలు!!

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన కమలం పార్టీ పశ్చిమ బెంగాల్‌పై ఫోకస్ పెట్టింది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కసరత్తు ప్రారంభించింది. బిహార్ ఎన్నికలు ముగిసిన వెంటనే బెంగాల్ ఎన్నికల ప్రచార కార్యాచరణ చేపట్టింది. ఎన్నికలకు 5 నెలలు ముందుగానే ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రాన్ని ఐదు జోన్‌లుగా విభజించి, ఆరు రాష్ట్రాల నుంచి 12 మంది సీనియర్ నాయకులకు ప్రచార బాధ్యతలు అప్పగించింది. పశ్చిమ బెంగాల్‌లోనూ జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తామని బిహార్ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బిహార్ విజయం బెంగాల్‌లో గెలుపునకు బాట వేసిందని వ్యాఖ్యానించారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా ఇదేరకమైన వ్యాఖ్యలు చేశారు. తమ తదుపరి లక్ష్యం బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయడమేనని ఉద్ఘాటించారు. బెంగాల్‌లో అరాచక పాలనకు చరమగీతం పాడతామని ప్రతిన బూనారు. వీరి మాటలను బట్టి చూస్తేనే అర్థమవుతుంది.. బెంగాల్ ఎన్నికలను బీజేపీ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో.

**త్రిముఖ వ్యూహం...** బెంగాల్‌లో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పదిహేనేళ్ల పాలనకు ముగింపు పలికి అధికారాన్ని దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది బీజేపీ. ఇందుకోసం క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. పశ్చిమ బెంగాల్‌ను 5 అధిక ప్రాధాన్యత గల జోన్‌లుగా విభజించి.. ప్రతి జోన్‌కు ఒక మంత్రిని, ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని నియమించారు. వీరంతా ఎన్నికల వరకు బెంగాల్‌లోనే మకాం వేస్తారు. బీజేపీ క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, బూత్–స్థాయి యంత్రాంగాన్ని ఏకీకృతం చేయడం, తృణమూల్ కాంగ్రెస్ బలమైన కోటల్లోకి ప్రవేశించడం వంటి లక్ష్యాలతో వీరు పనిచేస్తారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఏప్రిల్–మే నెలల్లో జరగనున్నాయి.

**రాధా–బంగా జోన్ (పురులియా–బర్ధమాన్)..** పురులియా, బర్ధమాన్‌లో తమ పార్టీ ఉనికిని పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లోగా సంస్థాగతంగా బలపడాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీంతో ఈ జోన్‌కు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) పవన్ సాయిని పర్యవేక్షుడిగా బీజేపీ అధినాయకత్వం నియమించింది. ఉత్తరాఖండ్ మంత్రి ధన్ సింగ్ రావత్ సహ–పర్యవేక్షుడిగా బాధ్యతలు అప్పగించింది.

**హౌరా–హుగ్లీ–మేదినీపూర్ జోన్..** హౌరా–హుగ్లీ పర్యవేక్షణను ఢిల్లీ సంస్థాగత మంత్రి పవన్ రాణా చూసుకుంటారు. ఆయనకు హరియాణాకు చెందిన సీనియర్ సంజయ్ భాటియా సహకారం అందిస్తారు. మేదినీపూర్ బాధ్యతలు ఉత్తరప్రదేశ్ మంత్రి జేపీఎస్ రాథోడ్‌కు కట్టబెట్టారు. టీఎంసీ– బీజేపీ మధ్య ఘర్షణలతో రాజకీయంగా సున్నితమైన ప్రాంతంగా మేదినీపూర్‌ను పరిగణిస్తున్నారు. బీజేపీ నేత సువేందు అధికారి ప్రభావం ఇక్కడ ఎక్కువగా ఉందన్న ప్రచారం జరుగుతోంది.

**కోల్‌కతా మెట్రోపాలిటన్ & సౌత్ 24 పరగణాలు..** బీజేపీ అత్యంత కఠినమైన ప్రాంతాలలో ఒకటైన ఈ బెల్ట్‌ను హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ కార్యదర్శి ఎం. సిద్ధార్థన్ పర్యవేక్షిస్తారు. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.టి. రవి ఆయనతో కలిసి పని చేస్తారు. ఈ జిల్లాల్లో చాలా కాలంగా తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

**నబద్వీప్ & నార్త్ 24 పరగణాలు...** ఆంధ్రప్రదేశ్ బీజేపీ కార్యదర్శి మధుకర్ నూకల ఈ ప్రాంతంలో కాషాయ పార్టీ ప్రచార బాధ్యతలు చూస్తారు. యూపీ మంత్రి సురేష్ రాణా సహ–ఇన్‌చార్జ్‌గా ఉంటారు. సరిహద్దు జిల్లా అయిన నార్త్ 24 పరగణాలను రాజకీయంగా వ్యూహాత్మక ప్రాంతంగా పరిగణిస్తారు. ఇక్కడ సంస్థాగతంగా బలపడాలని బీజేపీ భావిస్తోంది.

**ఉత్తర బెంగాల్ (మాల్దా–సిలిగురి డివిజన్)...** అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ కార్యదర్శి అనంత్ నారాయణ్ మిశ్రాకు మాల్దా ప్రాంత పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన అరుణ్ బిన్నాడి.. సిలిగురి ప్రాంతం బాధ్యతలు నిర్వహిస్తారు. బీజేపీ సాంప్రదాయ మద్దతు స్థావరాలలో ఒకటిగా పరిగణించబడే ఉత్తర బెంగాల్ ప్రాంతం అంతటా మాజీ కేంద్ర మంత్రి కైలాష్ చౌదరి చురుకైన పర్యవేక్షక పాత్రను పోషించనున్నారు.

## హైదరాబాద్‌లో సఫ్రాన్ కొత్త సెంటర్.. తెలంగాణ వృద్ధికి మైలురాయన్న సీఎం

హైదరాబాద్, నవంబర్ 26: శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరోపార్క్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన్ నెలకొల్పుతున్న LEAP ఇంజిన్ MRO సెంటర్‌ను ఈరోజు (బుధవారం) ప్రధాని నరేంద్ర మోదీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సఫ్రాన్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో LEAP ఇంజిన్‌ల మొట్టమొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ సెంటర్ అని తెలిపారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సదుపాయంతో 1,000 మందికి పైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇది స్థానిక ఎంఎస్ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఇవాళ సఫ్రాన్‌కు చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎమ్ఆర్‌వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. ఈ ఎమ్ఆర్‌వో భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్.. భారతదేశంలోని ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500 కి పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయన్నారు. తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని సీఎం తెలిపారు. భారతదేశంలోని ప్రముఖ ఎమ్ఆర్‌వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో




హైదరాబాద్ ఒకటన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఎగుమతులు గత ఏడాది రెట్టింపు అయ్యాయన్నారు. 9 నెలల్లో రూ.30,742 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. ఏరోస్పేస్ పెట్టుబడులను ఆకర్షించడానికి నైపుణ్యం చాలా ముఖ్యమైన ప్రమాణమని చెప్పుకొచ్చారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లను (ఐటీఐఎస్) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసిందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ విమానాల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణపై దృష్టి పెడుతోందన్నారు. 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని వెల్లడించారు. తమ విజన్‌ను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ 2047 – గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. బెంగళూరు–హైదరాబాద్‌ను డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాటు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.




## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఎక్కడ? జైల్లో మృతిచెందినట్లు వార్తలు..!

జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను చూపించాలంటూ ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు సైతం ఆయన్ని కలవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసనలు కూడా చేపట్టినట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. వాటికి సంబంధించినవిగా చెబుతున్న ఫొటోలు, వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. దీనంతటికీ కారణం ఇమ్రాన్ ఖాన్ జైల్లో మృతిచెందారనే వార్తలు బయటకురావడమే. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన్ని హతమార్చినట్లు సోషల్ మీడియాలో ఒక్కసారిగా వార్తలు తెరపైకి వచ్చాయి. బలూచిస్థాన్ విదేశాంగ శాఖ తమ 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. మరోవైపు ఆయన అనారోగ్యంతోనూ మరణించి ఉండొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. కానీ, ఇప్పటి వరకు వీటిని ధ్రువీకరించేలా అధికారికంగా ఒక్క ఆధారమూ బయటకు రాలేదు. ఈ వార్తల నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు మంగళవారం రాత్రి జైలు దగ్గరకు చేరుకున్నట్లు సమాచారం. వెంటనే తమ సోదరుణ్ని కలిసేందుకు అనుమతించాలని డిమాండ్ చేసినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కానీ, పోలీసులు అందుకు అనుమతించలేదని తెలుస్తోంది. పైగా వారిపై తీవ్రంగా దాడి కూడా చేసినట్లు సమాచారం. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిరసనలకు సంబంధించినవిగా పేర్కొంటూ పలు వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి.

గరుడ వార్త



# సంపాదకీయం

## బంగారు నక్క తోక తొక్కిన చైనా!

అన్ని రంగాల్లోనూ తనదైన శైలిలో దూసుకుపోతూ, అమెరికాకున్న అగ్రరాజ్యం అనే టైటిల్ కు ఎప్పుదు చెక్ పెట్టేద్దామా అన్నట్లుగా ఎదురు చూస్తోన్న డ్రాగన్ కంట్రీ చైనాకు ప్రకృతి ఓ గుడ్ న్యూస్ చెప్పింది! ఇందులో భాగంగా... చైనా తూర్పు లియానింగ్ ప్రావిన్స్ లో దేశ చరిత్రలోనే అతిపెద్ద బంగారు గని కనుగొనబడింది. దీంతో.. చైనా బంగారు నక్క తోక తొక్కిందా అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అవును... 1949 తర్వాత చైనాలో తాజాగా ఓ అతిపెద్ద బంగారు నిక్షేపం కనుగొనబడింది. గత ఏడాది భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు కనుగొన్న గని కంటే ఇది చాలా పెద్దది. అది సుమారు 83 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దాచిపెట్టగా.. తాజా గనిలో సుమారు 1440 టన్నుల బంగారం నిల్వలున్నాయని.. దీని మొత్తం విలువ సుమారు 192 బిలియన్ డాలర్లు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే... భారత కరెన్సీలో సుమారు 17,08,000 కోట్ల రూపాయలు అన్నమాట! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్స్, అత్యాధునిక టెక్నాలజీతో ఈ గనిని గుర్తించారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టులో సుమారు వెయ్యి మంది ప్రహుత్వ ఉద్యోగులు సుమారు 15 నెలలపాటు అన్వేషించి, తవ్విన తర్వాత ఈ స్థాయిలో భారీ బంగారు గని బయటపడిందని చెబుతున్నారు. గతంలో బంగారు గని అభివృద్ధి భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్న తర్వాత.. చైనా నేషనల్ గోల్డ్ గ్రూప్, లియోనింగ్ మినరల్ జియాలజీ గ్రూప్, యింగ్ కౌ మునిసిపల్ ప్రభుత్వం.. తాజాగా ఓ భారీ పారిశ్రామిక సముదాయాన్ని నిర్మించడం ద్వారా స్థానిక బంగారు పరిశ్రమను ప్రోత్సహించడానికి సుమారు 2.82 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నాయి.

**బహుశా ఎప్పటినుంచో వెతుకుతున్న 'ఎల్ డోరాడో' ఇదే కావొచ్చు!:** ఈ సందర్భంగా స్పందించిన సీపీసీ షెన్యంగ్ మున్సిపల్ పార్టీ స్కూల్ ప్రొఫెసర్ వాంగ్ యాన్.. చైనా డైలీతో మాట్లాడుతూ.. ఈ గనిలోని వెయ్యి టన్నులకు పైగా నిల్వలు జాతీయ బంగారు వ్యూహాత్మక నిల్వలను గణనీయంగా భద్రపరుస్తాయని అన్నారు. ఇది ప్రపంచ మార్కెట్ లో దాని పోటీతత్వాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే.. బహుశా మనం ఎప్పటినుంచో వెఉతుకున్న ఎల్ డొరాడో ఇదే కావొచ్చు అనే కామెంట్లు ఇప్పుడు చైనా నుంచి వినిపిస్తున్నాయి. కాగా.. ఎల్ డొరాడో అనేది ఒక పౌరాణిక నగరం! ఇది బంగారంతో నిండి ఉందని నమ్ముతారు. దీనికి స్పెయిన్ లోని పురాణగాథల నుంచి మూలాలు ఉన్నాయి.

## సీనియర్ టీచర్ల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలంటూ వినతి

### ఎంపీ ఈటెల కు వినతి పత్రం ఇచ్చిన ఉపాధ్యాయులు



శామీర్ పేట, నవంబర్ 26( గరుడ వార్త ) : సీనియర్ టీచర్ల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటెలకు వినతిపత్రం అందజేశారు. ఎస్ టి ఎఫ్ ఐ పిలుపులో భాగంగా బుధవారం ఉదయం టి ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మల్కాజి గిరి లోకసభ సభ్యుడు ఈటెల రాజేందర్ ని కలిసి పార్లమెంటులో చట్ట సవరణతో సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చి వారి ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ పాతిక, ముప్పై సంవత్సరాల సర్వీసు చేశాక ఇప్పుడు అర్హత పరీక్ష వ్రాయాలనటం అర్థరహితమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి మినహాయింపు కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్ టి ఎఫ్ ఐ ప్రధాన కార్యదర్శి, టి ఎస్ యు టి ఎఫ్ అధ్యక్షుడు చావ రవి, టి ఎస్ యు టి ఎఫ్ కోశాధికారి టి లక్ష్మారెడ్డి, వివో టి టి ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జయసింహారెడ్డి, ఎం మదన్ రెడ్డి, జిల్లా నాయకులు మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, పురుషోత్తమ్, శ్రీనివాస్, కుమార్, స్వప్న, బంటు రాజు, హరేరామ్, సంతోష్, మల్లేశప్ప తదితరులు పాల్గొన్నారు.

## హలో మాల చలో ఢిల్లీకి తరలి వెళ్ళిన మండల మాల మహానాడు నాయకులు ...





శామీర్ పేట, నవంబర్ 26( గరుడ వార్త) : హలో మాల చలో ఢిల్లీకి పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండల మాల మహానాడు నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం జంతర్ మంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డా. అద్దంకి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభ జరిగిందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశంలో ఉన్న పౌరులకు హక్కులు కల్పించడం జరిగిందని తెలిపారు. పౌరులకు కల్పించిన ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచుకునే అవకాశం ఉందన్నారు. ఈ దేశానికి సుస్థిర మహోత్తర రాజ్యాంగాన్ని అందిస్తే రాజ్యాంగం అమల్లోకి వచ్చి 77 సంవత్సరాలైనా పాలకులు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదాహరణకి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గావాయ్ పై సుప్రీం కోర్ట్ లోనే మతోన్మాద లాయర్ షూ విసరడం గోరమని, ఒక దేశ అత్యున్నత పదవిలో ఉన్న దళితునికే ఈ పరిస్థితి ఉంటే ఇక దేశంలో ఉన్న సామాన్య దళితుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. ,పై విధంగా మాలలకు, దళితులకు ఏ సమస్య వచ్చినా అంబేద్కర్ వారసులుగా ముందుంటూ జాతీయ మాలమహానాడు రాష్ట్రస్థాయిలోనే కాకుండా ఢిల్లీ వీధుల్లో సైతం నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకొని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రాజ్యాంగ హక్కుల సాధన సభ తో పలు డిమాండ్స్ తో ఢిల్లీ జంతర్ మంతర్ లో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాయకులతో పాటు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం, ఉపాధ్యక్షులు పడిగం ఆంజనేయులు, ఘాట్కేసర్ మండల ప్రధాన కార్యదర్శి గుమ్మడి మురళి మోహన్, ఘాట్కేసర్ పట్టణ అధ్యక్షుడు ఎజ్జల రఘు, లాల్ గడి మలక్ పేట గ్రామ శాఖ అధ్యక్షుడు కైరా బాలు, యువ నాయకులు బుర్క వెంకటేష్ , వెంకన్న బాబు, గోపి, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

### డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కు ఘననివాళి





శామీర్ పేట, నవంబర్ 26 ( గరుడ వార్త) : రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శామీర్ పేట మండలం తూంకుంటలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై నాయకులతో కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వజ్రష్ యాదవ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ సేవలు అపారమైనవి అన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను కాపాడాలని, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూధన్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ బాల్ నర్సింహా, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తిగుళ్ల మురళి గౌడ్, నానిగళ్ళ హరిగోపాల్, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, తిగుళ్ల దర్శన్ గౌడ్, మన్నే బిక్షపతి, గట్టు ప్రదీప్ కుమార్, టీఆర్ రవీందర్ గౌడ్, మొత్కుల మల్లేష్ యాదవ్, బస్వా రెడ్డి, అబ్బగౌని భాస్కర్ గౌడ్, కుదుముల వెంకటేష్, రామిడి శశిధర్ రెడ్డి, సుతారిగుడెం దుర్గయ్య, మిర్యాలకర్ సాయి కుమార్, గురిజాల బాబు, కత్తి రమేష్, మాట్ల వినయ్ కుమార్, వజ్జల శేశాంత్, ఎలకుర్తి భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

**శామీరపేట.....**మండల కేంద్రం శామీర్ పేట మండల కార్యాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దళిత సేన అధ్యక్షుడు వజ్జల మురళి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సేన నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## పకడ్బందీ గా నీటి వనరుల గణన : తహసీల్దార్ సుచరిత



శామీర్ పేట, నవంబర్ 26 (గరుడవా వార్త) : నీటి వనరుల గణన పకడ్బందీగా నిర్వహించాలని మూడుచింతల పల్లి తహసీల్దార్ సుచరిత సూచించారు. బుధవారం మూడు చింతలపల్లి తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎన్యుమరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ గణనకు 2023-24 సంవత్సరం నకు ప్రామాణికంగా, పేపర్ రహితముగా మొబైల్ యందు ప్రత్యేకముగా రూపొందించిన యాప్ లో గణన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ గణనలో గణకులుగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, గ్రామ పరిపాలన అధికారులు, ఇతరులను తీసుకొని ఇట్టి గణనను నవంబర్ 27 నుంచి డిసెంబర్ 20 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో ఎన్యూమరేటర్లు గా గ్రామ పలనా అధికారులను, పంచాయతీ సెక్రటరీలను, మునిపాలిటీ సిబ్బంది ని, వి.ఆర్.ఎ లను, ఇరిగేషన్ సిబ్బందిని నియమించంచడం జరిగిందని తెలిపారు. కాగా ఈ శిక్షణ కార్యక్రమం ఎన్యూమరేటర్లకు మండల ప్రణాళిక, గణాంక అధికారి రాధిక శిక్షణను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## కాగితాల్లో నివేదికలు.. కన్నీళ్లు తుడవని పథకాలు

సిరిసిల్ల: పంట బీమా లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్లు, వడగళ్ల రూపంలో రైతులను నిండా ముంచుతున్నాయి. విపత్తులు వచ్చినప్పుడు వ్యవసాయశాఖ ప్రాథమిక సర్వేచేసి చేతులు దులుపుకొంటోంది. మరోవైపు పీఎం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని చెబుతున్నా ఇప్పటికీ అమల్లోకి రాలేదు. బీమా లేక నాలుగేళ్లుగా పంటలు దెబ్బతిన్న రైతులు భారీగా పెట్టుబడులు నష్టపోతున్నారు. వచ్చే సీజన్ నుంచి అయినా బీమా అమల్లోకి వస్తే రైతులకు భరోసా ఇచ్చినట్లు ఉంటుంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో ఈ సీజన్‌లో వరి, పత్తి పంటలు కంకి, పూత, కాయ దశలో ఒకసారి.. చేతికందే దశలో మరోసారి రెండుసార్లు వర్షాలు ముంచెత్తాయి. మానేరు వాగులో వచ్చిన భారీ వరదలకు పరివాహక ప్రాంతంలో పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ జిల్లాలో 564 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసింది.

రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి 178 ఎకరాలు గుర్తించారు.



నష్టం జరిగిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దీనిలో 34 ఎకరాల్లోని పట్టా భూముల్లో మాత్రం ఉపాధిహామీలో పూడికతీతకు అంచనాలు సిద్ధం చేశారు.

మరోవైపు పంట నష్ట పరిహారం ఊసేలేదు. జిల్లాలో 2023లో యాసంగి సీజన్‌లో మాత్రం 192 ఎకరాల్లో 219 మంది రైతులకు చెందిన పంట నష్టం జరిగింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విపత్తుల నిర్వహణలో భాగంగా రూ. 19.20 లక్షలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2024 యాసంగి సీజన్‌లో జిల్లాలో గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో వడగళ్ల వర్షం కురిసింది. ముస్తాబాద్ మండలం మద్దికుంట, మోహినికుంటలో 34 ఎకరాలు, గంభీరావుపేట మండలం గజసింగారంలో 10 ఎకరాల్లోని మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. 23 మంది ఉద్యానవన పంటలు సాగుచేసే రైతులకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. అలాగే 1014.23 ఎకరాల్లో వరి పంట నష్టాన్ని ప్రాథమిక అంచనా వేశారు.

## నలుదిక్కులా కొలువులు..

ఖమ్మం : ఉభయ జిల్లావాసుల దృష్టిలో విదేశీ కొలువులు అనగానే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాలకు ఎం.ఎస్. చదువు పేరుతో వెళ్లటం, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించి అక్కడే స్థిరపడటం అన్న అభిప్రాయం ఉండేది. కొన్నేళ్లుగా ఈ ధోరణి మారుతోంది. విదేశీ కొలువులంటే సాఫ్ట్‌వేర్ ఒక్కటే కాదని, ప్రాచ్య దేశాలూ ఉద్యోగ గనులన్న విషయం యువత గ్రహిస్తోంది. వృత్తి నైపుణ్యం ఉండి ఇతర దేశాల్లో ఆకర్షణీయ వేతనంతో పనిచేయాలనుకునే వారికి 'టామ్‌కామ్' వారధిగా నిలుస్తోంది. ఉభయ జిల్లాల్లో మూడేళ్ల వ్యవధిలో ఇలా కొలువులు పొందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.టామ్‌కామ్ అంటే?తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్. ఉపాధి కల్పన శాఖ అనుబంధ విభాగం. కార్మిక, పరిశ్రమల శాఖల సమన్వయంతో ఇది పనిచేస్తుంది. నర్సింగ్, ఐటీఐ, ప్లంబర్, హాస్పిటాలిటీ, ఫార్మా, బిల్డింగ్ వర్కింగ్ తదితర విభాగాల్లో వృత్తి నైపుణ్యం ఉన్న వారిని పలు దేశాలు ఆహ్వానిస్తున్నాయి. అన్‌స్కిల్డ్ కొలువులకూ అర్హులను పిలుస్తునారు. ఆయా దేశాల్లో ఖాళీల ఆధారంగా ఎప్పటికప్పుడు టామ్‌కామ్ జిల్లాలో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. స్క్రీనింగ్‌లో అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి వారిని ఉద్యోగం చేయాల్సిన దేశాలకు పంపుతోంది. దళారీ వ్యవస్థకు దీనిద్వారా అడ్డుకట్ట పడుతోంది.

**మచ్చుకు కొందరు...**

టామ్‌కామ్ ద్వారా ఎం.రేవంత్ కుమార్, జి.ప్రవీణ్ కుమార్ (యూఏఈ), ఎం.సునీల్ (జర్మనీ), సాయిలు, కె.రాజేందర్ (ఇజ్రాయిల్) దేశాల్లోని కొలువులు అందిపుచ్చుకున్నారు. వీరి నెల వేతనం రూ. 2-5 లక్షలు.భద్రాద్రి జిల్లా నుంచి మహ్మద్ హుస్సేన్ (ఆస్ట్రేలియా), పి.వీరబాబు, శ్రీరాములు అనంత వేణుగోపాలచారి, ఎం.కళ్యాణ్ నాయక్, జి.శ్రీకాంత్, ఎల్.సాయిశంకర్, జి.వంశీకృష్ణ, నవీన్ (జర్మనీ), జి.సునితలు అర్హత సాధించి జపాన్‌లో పనిచేస్తున్నారు.

గ్రీస్‌లోని సంస్థల్లో హౌస్ కీపింగ్, వెయిటర్లు, బార్ అటెండర్లు, రిసెప్షనిస్టులు, స్పా థియేటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, లైఫ్ గార్డులు, గార్డెనర్లు, క్లీనర్లు, బెల్ బాయ్స్, ఫిషర్‌మెన్ ఖాళీల భర్తీకి రెండు నెలల క్రితం ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. 350 మంది నమోదు కాగా



పాస్‌పోర్ట్, అనుభవం, ఆంగ్ల పరిజ్ఞానం ప్రాతిపదికన 32 మంది ఎంపికయ్యారు.తాజాగా జర్మనీలోని ఓ సంస్థకు ఎలక్ట్రీషియన్లు అవసరం కాగా ఖమ్మంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఐటీఐ ఎలక్ట్రికల్ ట్రేడ్ పూర్తి చేసి 106 మంది ముందుకొచ్చారు. మౌఖికాల్లో విజయం సాధించిన వారికి అవకాశం దక్కుతుంది. నెల వేతనం రూ. 2.7 లక్షలు.

**ఆ రెండు దేశాల్లో..**

జర్మనీ, జపాన్ మినహా మిగిలిన అన్ని దేశాల్లో కొలువులకు ఆంగ్ల భాష పరిజ్ఞానం సరిపోతుంది. జర్మనీ, జపాన్‌లో ఆ భాషలు నేర్చుకున్నవారికే అవకాశాలుంటున్నాయి. ఔత్సాహికులకు హైదరాబాదులోనే ఈ భాషలు నేర్పించే వెసులుబాటు టామ్‌కామ్ కల్పిస్తోంది.

ఉద్యోగ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం కొన్ని దేశాలతో చేసుకున్న ఉద్యోగ ఒప్పందాలకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. విదేశీ ఉద్యోగ సంస్థ, అభ్యర్థికి మధ్య టామ్‌కామ్ ఓ నమ్మక వారధి పాత్ర పోషిస్తోంది. నియామకాల ప్రక్రియ అనేది నిరంతర ప్రక్రియ.

ఉపాధి కల్పన శాఖ అధికారులు

# సేకరణలో తాత్సారం.. అక్రమాలకు ఆస్కారం

పెద్దపల్లి : సుల్తానాబాద్‌లోని ఓ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇటీవల జరిపిన తనిఖీల్లో నిల్వలో వ్యత్యాసాన్ని గుర్తించారు. అయినా దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మంథనిలోని ఓ మిల్లులో ఇలాంటి ఘటన పునరావృతంకాగా మరుసటి సీజన్‌లో ధాన్యం ఇవ్వొద్దనే ఆదేశాలను రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు పక్కనబెట్టినట్లు ఆరోపణలున్నాయి. లెవీ బియ్యం సేకరణలో తరచూ ప్రభుత్వ సంస్థలు తాత్సారం చేయడం మిల్లర్లకు వరంగా మారింది. ఒక సీజన్‌లో ఇచ్చిన ధాన్యానికి సంబంధించిన బియ్యం మరుసటి సీజన్ మొదలయ్యేలోపు ఇవ్వాల్సి ఉండగా ఏళ్లు గడిచినా ఇవ్వకుండా అక్రమాలకు తెరలేపారు. నిర్దేశిత గడువులోగా ఇవ్వని సీఎంఆర్ కోటా టన్నుల కొద్దీ బియ్యం రికార్డుల ప్రకారం మిల్లర్ల వద్దే మూలుగుతోంది. కానీ భౌతికంగా ఒక్క మిల్లులో కూడా గడిచిన సీజన్‌కు సంబంధించిన ధాన్యం నిల్వలు లేవంటే అతిశయోక్తి కాదు.

**కోటా పూర్తికాకపోగా..**

2023-24 వానాకాలం సీజన్‌లో 1,29,199.95 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా 23,388.54 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి ఉంది. ఈ సీజన్‌లో ఎఫ్‌సీఐ కోటా 98 శాతం పూర్తి చేసినప్పటికీ పౌరసరఫరాల కోటా 50 శాతం కూడా పూర్తి కాలేదు. 2023-24 యాసంగి కోటా మాత్రం సివిల్ సప్లై నూరు శాతం పూర్తి చేశారు. కానీ ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన 1973.15 మెట్రిక్ టన్నుల



పొడి బియ్యం కేవలం 29 శాతం కోటా మాత్రమే పూర్తయింది.

**చర్యలు చేపట్టడంలో వైఫల్యం**2022-23 సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో బియ్యం తీసుకోవడంపై అనిశ్చితి ఏర్పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల వద్ద భారీ స్థాయిలో ధాన్యం పేరుకుపోయింది. ఈ కోటా పూర్తికి ప్రభుత్వం జిల్లాలో 2.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలం వేసింది. ఈ మొత్తానికి సమానమైన డబ్బులు వేలం దక్కించుకున్న కంపెనీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు సదరు సంస్థలు ప్రభుత్వానికి చెల్లింపులు జరపలేదు. జిల్లాకు సంబంధించి రూ.86.8 కోట్ల విలువైన బియ్యం ఇవ్వాల్సి ఉండగా దీని గడువు ముగిసింది. అయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకునేందుకు అడుగులు పడలేదు.

# అతివకు అందలం.. ఆశావహుల ఉత్సాహం

జగిత్యాల : పంచాయతీల్లో సర్పంచులు, వార్డుల రిజర్వేషన్లు తేలడంతో పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదట సర్పంచులుగా, వార్డు సభ్యులుగా గెలిచి సర్పంచులుగా ఉపసర్పంచులుగా అవకాశం దక్కించుకోవాలని చాలా మంది ఆరాట పడుతున్నారు. ఓడితే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, సహకార సంఘాల ఎన్నికల్లో అదృష్టం పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.

జిల్లాలోని 385 పంచాయతీల్లో 174 సర్పంచి స్థానాలను మహిళలకు కేటాయించారు. మిగిలిన జనరల్, ఎస్టీ జనరల్, ఎస్సీ జనరల్, బీసీ జనరల్ స్థానాల్లోనూ అతివలు పోటీ చేసే అవకాశం ఉంది. గత పర్యాయం జిల్లాలో అత్యధిక సంఖ్యలో సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులతో సహా ఛైర్‌పర్సన్ వరకు మహిళల శాతమే అధికంగా ఉండగా ఈ సారీ అదే తీరులో అవకాశాలను ఆశిస్తున్నారు.

**ఓటేయడంలోనూ వారే అధికం**

జిల్లాలో ఓటర్ల సంఖ్యాపరంగా మహిళలే అధికంగా ఉండగా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

అన్ని గ్రామాల్లో 16 వేలకు పైగా స్వశక్తి సంఘాలుండగా ప్రస్తుత ఎన్నికల్లో వీరి పాత్ర కీలకంగా మారనుంది.

పురుష ఓటర్లలో వేల సంఖ్యలో విదేశాలు, ఇతర ప్రాంతాల్లో ఉంటుండగా స్వస్థలాల్లో ఉండే మహిళలే ఓటింగ్‌లో అధికంగా పాల్గొంటారు. గతంలో అన్ని ఎన్నికల్లో పురుషుల కన్నా దాదాపు 10 శాతం అధికంగా అతివలే ఓటు వేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. స్వశక్తి సంఘాల నిర్వహణ, ఐకేపీ ధాన్యం కొనుగోళ్లు, బీడీ కార్మికులుగా సత్తా చాటుతున్న మహిళలు వచ్చే పంచాయతీ ఎన్నికల్లోనూ తమను తాము నిరూపించుకోవాలని ఎదురుచూస్తున్నారు.

ఇదే తరుణంలో పల్లెల్లో పోటీపడేవారు అన్నివర్గాల మహిళలను ప్రసన్నం చేసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించారు.

జిల్లాలో పురుష ఓటర్లు: 2,89,702
మహిళలు: 3,17,552 మొత్తం పంచాయతీలు: 385 వార్డులు: 3,536 సర్పంచి స్థానాల్లో ఎస్టీ మహిళలకు: 10 ఎస్సీలకు: 31 బీసీలకు: 44 జనరల్: 89

# రూపే కార్డులతో చిరు సాయం

కరీంనగర్ : జిల్లాలోని నగర, పురపాలికల్లో చిరు వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. అయిదేళ్ల నుంచి వారికి ప్రధానమంత్రి స్వనిధి రుణాలను అందిస్తోంది. దీని గడువు పెంచడంతోపాటు వారికిచ్చే రుణాన్ని లోక్ కల్యాణ్ మేళాలో భాగంగా పెంచారు. దీంతో సామాజిక భద్రతతోపాటు ఆర్థిక అవసరాలు తీరనున్నాయి. గతంలో రూ.10 వేలు రుణమందించగా ప్రస్తుతం మొదటి విడతలో రూ.15 వేలు తీసుకున్నవారు 12 నెలల్లో.. సక్రమంగా చెల్లిస్తే రెండో విడతలో రూ.25 వేలు 18 నెలల్లో.. రెండు విడతలు పూర్తిగా చెల్లించినవారికి రూ.50 వేలు ఇస్తున్నారు. దీనిని 36 నెలల్లో చెల్లించాలి.

**79,530 మంది వ్యాపారులు** ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రామగుండం నగరపాలికలతోపాటు 13 మున్సిపాలిటీల్లో 79,530 మంది వీధి వ్యాపారులున్నారు. వీరిలో అత్యధిక శాతం మంది రెండు విడతల్లో రుణాలు తీసుకున్నారు. కొత్తగా రుణాలు తీసుకునే వీధి వ్యాపారులుంటే దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు.**మూడు విడతల్లో పూర్తి చేస్తేనే..**

అత్మనిర్భర్ కింద మొదటి విడత రుణాలు తీసుకొని రెండో విడతకు అర్హులుగా ఎంపికవుతారు. రెండు విడతలు సక్రమంగా చెల్లించి మూడో విడతకు రూ.50 వేల రుణం మంజూరవుతోంది. మూడు సంవత్సరాల్లో చెల్లించినవారికి మళ్లీ రుణం కావాలంటే అవకాశంలేదు. అలాంటివారికి బ్యాంకర్లు రూపే క్రెడిట్ కార్డు అందిస్తారు. ఈ కార్డు ద్వారా రూ.30 వేలు తీసుకొని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

# దబాయింపులు.. వసూళ్లు



కామారెడ్డి : పురపాలికల్లో పాలకవర్గ గడువు ఈ ఏడాది జనవరి 25తో ముగిసింది. అయినా పది నెలల నుంచి ఇప్పటికీ కొందరు ప్రజాప్రతినిధులం తామేనన్న భ్రమలో ఉన్నారు. వార్డుల్లో తిరుగుతూ అనధికారిక పనులపై దృష్టి పెడుతున్నారు. కార్యాలయానికి వచ్చే ఖద్దరు నాయకులు అధికారులపై జబర్దస్తీకి దిగుతున్నారు. మేము ఏది చెబితే అలాగే నడవాలని హుకుం జారీ చేస్తున్నారు. తాజా మాజీలతో తలనొప్పిగా మారిందని అధికారులు అంతర్మథనం చెందుతున్నారు.

**ఏమేం చేస్తున్నారంటే..**

తాజా మాజీలు పురపాలక కార్యాలయం చుట్టూ తరచూ చక్కర్లు కొడుతున్నారు. ఆయా విభాగాల్లో కింది స్థాయి సిబ్బందిని మచ్చిక చేసుకుని కార్యాలయంలో ఏం జరుగుతుందో ఆరా తీస్తున్నారు. కొన్ని పనులకు బినామీలుగా ఉండటంతో వారు కార్యాలయాన్ని వీడటం లేదు. తాజా మాజీ ప్రజాప్రతినిధులు గ్రూపులుగా ఏర్పడ్డారు. ఒక్కో గ్రూపులో నలుగురు నుంచి ఆరుగురు ఉన్నట్లు సమాచారం. వీరు వార్డుల్లో ఏదేని సమస్య ఉందంటే అక్కడే వాలిపోతున్నారు. వివాదాన్ని పరిష్కరిస్తామని చెబుతూ ఎంతో కొంత తీసుకుని జారుకుంటున్నారు. 'కామారెడ్డిలో పాత పట్టణంలో ఓ బస్తీ ప్రాంతానికి సమీపంలో జీ ప్లస్ 2 నిర్మాణం చేపట్టారు. పురపాలక శాఖలో అనుమతి కోసం దరఖాస్తు చేశారు. రెండు నెలలు గడిచినా అనుమతి రావడం లేదు. ధ్రువపత్రం లేనిదే పనిచేయొద్దని సిబ్బంది చెప్పారు. ఓ రోజు తాజా మాజీ ప్రజాప్రతినిధి ఆ మార్గంలో వెళ్లేటప్పుడు ఆ భవన నిర్మాణంపై కన్ను పడింది. వెంటనే అతడు యజమానిని కలిశారు. రూ.40 వేలు ఇవ్వాలని, అనుమతి ఇప్పిస్తానని పేర్కొన్నారు.'

ఖాళీస్థలాల వివాదాల్లో తల దూరుస్తున్నారు. సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ప్రజలు వార్డు సమస్యలపై ఫిర్యాదు చేస్తే తాము అధికారంలో లేమని ఓ వైపు చెబుతూనే కాసులు వచ్చే పనుల్లో మాత్రం తలదూరుస్తున్నారు. ఈ విషయమై కామారెడ్డి పురపాలక కమిషనర్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. బయట జరిగే వ్యవహారం తమకు సంబంధం లేదన్నారు. కొన్ని విషయాల్లో తాజా మాజీల ప్రభావం ఉందని అడగగా.. దానిపై స్పందించడానికి నిరాకరించారు.

# 'మెట్రో' నగరం.. 'డివైడర్లతో' నరకం



హైదరాబాద్: నగరంలో విభాగినుల మధ్యలో మెట్రోరైలు స్తంభాలు ఏర్పాటు చేశారు. అవి దెబ్బతినకుండా.. వాహనాలు ఢీకొట్టినా.. ఆ ప్రభావాన్ని పరిమితం చేసేందుకు భద్రతా చర్యలు చేపట్టింది. ఢీకొట్టే అవకాశం ఉన్న ఎత్తు వరకు థర్మకోల్ షీట్స్ ఏర్పాటు చేసి ఆ తర్వాత రక్షణ గోడ కట్టారు. వాహనదారుల భద్రత చర్యలు మాత్రం చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. తరచూ స్తంభాలకు ద్విచక్రవాహనదారులు, కార్లు ఢీకొట్టి పలువురు మృత్యువాత పడుతున్నారు. ఆదివారం సైతం ఇద్దరూ చనిపోయారు. అయినా హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఎంఆర్‌ఎల్)కు చలనం లేదని పలువురు వాపోతున్నారు.


**ఇవీ కారణాలు..**

సరైన వెలుతురు లేక: మెట్రోరైలు నిర్మించిన మూడు మార్గాల్లో ఇదివరకు సెంట్రల్ లైటింగ్ ఉండేది. మెట్రో నిర్మించే సమయంలో వాటిని తొలగించారు. విశాలమైన రోడ్లలో వెలుతురు లేక తరచూ వాహనదారులు డివైడర్లను ఢీకొడుతున్నారు. రైడర్లు, డ్రైవర్లు స్పష్టంగా చూడగలిగేలా.. ప్రమాదాల నివారణకు వీధి దీపాలు ఉండటం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

**అప్రమత్తత శూన్యం:** రైడర్లు, డ్రైవర్లను అప్రమత్తం చేసేలా స్తంభాల ముందు, డివైడర్ల పొడవునా రేడియం రిఫ్లెక్టివ్ షీట్స్‌తో కూడిన హెచ్చరికలు ఉండాలి. ఇవి లేకపోవడంతో డివైడర్ ఎక్కడ ఉందో కన్పించక వాహనాలు ఢీకొట్టుంటున్నాయి. అతి వేగం ప్రమాదాలకు కారణమే అయినా.. రేడియం స్టిక్కర్లు ఉంటే వాటిని చూడగానే వేగాన్ని అదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది.

మలుపుల్లో: అమీర్‌పేట నుంచి రాయదుర్గం వెళ్లే మార్గం పూర్తిగా మలుపుల్లో ఉంటుంది. మలుపుల్లో స్తంభాలు కన్పించేలా స్టిక్కర్లు ఉండాలి. చాలా చోట్ల లేవు.

# ట్యాంకర్ల అక్రమాలకు చెక్



హైదరాబాద్: నగరంలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ల అక్రమాలకు చెక్‌పెట్టేలా జలమండలి కార్యాచరణ చేపట్టింది. నగరంలో నీటి సరఫరాకు జలమండలి వినియోగిస్తున్న ట్యాంకర్లు అంతకంతకు పెరుగుతున్నాయి. ఇదే అదనుగా జలమండలి నీటిని సరఫరా చేసే ట్యాంకర్ డ్రైవర్లు అక్రమాలకు తెరతీసిన నేపథ్యంలో జలమండలి అప్రమత్తమైంది. కొందరు వినియోగదారుల క్యాన్ నంబర్లు (నీటి కనెక్షన్ గుర్తింపు సంఖ్య), ఫోన్ నంబర్లను తీసుకుని అక్రమంగా ట్యాంకర్లను బుక్‌చేసి ప్రైవేటుగా విక్రయించుకుంటున్న వైనం గతంలో వెలుగు చూసింది. సుమారు 120 మంది డ్రైవర్లు వినియోగదారుల క్యాన్ నంబర్‌కు ట్యాంకర్ డ్రైవర్ల ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేసి ఆ నంబరుతో నీటి ట్యాంకులను బుక్ చేసి ప్రైవేటుగా అమ్ముకున్నట్లు గుర్తించారు. ట్యాంకర్ డ్రైవర్ల ఫోన్ నంబర్ల నుంచే ఎక్కువ బుక్‌అయిన అంశం వెలుగు చూసింది. ఒక ట్యాంకర్ డ్రైవర్ ఏకంగా 900 ట్యాంకర్లు బుక్ చేసినట్లు గుర్తించారు. క్యాన్ నంబర్ సాయంతో గృహావసరాలకు సబ్సిడీ రేట్లతో బుక్ చేసుకుని హోటళ్లు, డిమాండ్ ఉన్న నివాసాలకు రెట్టింపు ధరలకు విక్రయించినట్లు వెల్లడైంది. క్యాన్ నంబర్లను దుర్వినియోగం చేసి డబ్బు దండుకున్న డ్రైవర్ల నంబర్లను బ్లాక్ చేసింది. ఆకస్మిక తనిఖీలూ చేపడుతోంది. వేసవిలో ట్యాంకర్ల పర్యవేక్షణకు ప్రతి ఫిల్లింగ్ స్టేషన్‌కు బాధ్యులను నియమించనుంది. డిసెంబరు, జనవరి నుంచే ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో జలమండలి అప్రమత్తమైంది.

# గతుకులకు అతుకులు



హైదరాబాద్: నగరవ్యాప్తంగా రహదారుల పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం రూ.12.29కోట్లతో మరమ్మతులు చేపట్టింది. సర్కిళ్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు చేపడుతున్నామని ముఖ్య ఇంజినీరు రత్నాకర్ స్పష్టం చేశారు. వానాకాలం మొదలైనప్పట్నుంచి.. శనివారం వరకు గ్రేటర్ పరిధిలోని రహదారులపై 21241 గుంతలను పూడ్చినట్లు, 1,012 మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేసినట్లు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది.

**ఎక్కడెక్కడంటే...**

జూబ్లీ చెక్‌పోస్టు నుంచి కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం వరకు రోడ్డు మరమ్మతులు పూర్తయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నం.7, రోడ్డు నం.14లలో మొత్తం 6.5కి.మీ రోడ్ల పునరుద్ధరణ జరిగింది.

ఎల్బీనగర్ జోన్ కామినేని కూడలి పైవంతెన సర్వీసురోడ్లను ఆధునికీకరించారు.

కేపీహెచ్‌బీ కాలనీలోని అంతర్గత రహదారులతో పాటు వసంత్‌నగర్, తదితర కాలనీ రోడ్ల పునరుద్ధరణ పురోగతిలో ఉంది.

లింగోజిగూడ ఎస్బీహెచ్ వెంచర్‌లో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. మెహిదీపట్నం, టోలిచౌకి మధ్యనున్న రేతిబౌలి చౌరస్తా, నానల్‌నగర్ చౌరస్తాలు గుంతలమయం కావడంతో..కూడలిలో విపరీతంగా వాహన రద్దీ ఏర్పడుతోంది. దీంతో రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టారు.

# ఆదాయమే ముఖ్యం.. వసతులు మృగ్యం

కరీంనగర్: ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖలో రవాణా శాఖ కీలకమైంది. వివిధ పనుల నిమిత్తం ఆర్టీఏ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది వెళ్తుంటారు. లైసెన్స్, రిజిస్ట్రేషన్‌కు ఇక్కడికి వెళ్లక తప్పదు. ప్రభుత్వానికి ఈ శాఖ ద్వారా ఏటా రూ.వందల కోట్లలో ఆదాయం సమకూరుతోంది. అయితే ఈ కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వసతుల కల్పనలో నిర్లక్ష్యంపై 'న్యూస్‌టుడే' కథనం.

**రూ.300 కోట్లకుపైగా..**

జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వెళుతుంటారు. ప్రతి రోజు దాదాపు 350కిపైగా స్లాట్‌లు బుక్ అవుతుంటాయి.




ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.300 కోట్లకుపైగా ఆదాయం వస్తుండగా.. కేవలం కరీంనగర్ జిల్లా నుంచే 50 శాతం ఆదాయం సమకూరుతోంది

**సమస్యలు అనేకం..**

కరీంనగర్ రవాణా శాఖ కార్యాలయం ఆవరణలోని రహదారంతా గుంతలమయమైంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైవింగ్ పరీక్ష నిర్వహించే తాత్కాలిక ట్రాక్ వద్ద, వాహనాలు నిలిపే ప్రాంతంలో కూర్చోవడానికి ఎటువంటి సదుపాయాలు లేవు. చెట్ల కింద నిరీక్షించాల్సి వస్తోంది. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కార్యాలయానికి వెళ్లేవారు నీళ్ల సీసాలను వెంట తీసుకెళ్లడం లేదా దుకాణాల్లో కొనుక్కోవాల్సి వస్తోంది.

శౌచాలయాలు లేకపోవడంతో మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. కార్యాలయం ఆవరణలోని సీసీ కెమెరాలు సైతం పని చేయడం లేదంటున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

# పంచాయతీ పోరులో రిజర్వేషన్లు ఖరారు

ఖమ్మం : గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల లెక్క తేలింది. ఎవరు ఎక్కడ పోటీ చేయాలో ఖరారైంది. జిల్లాలో 571 గ్రామ పంచాయతీల్లో సర్పంచి, 5214 వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానాలు ఖరారు చేశారు. ఎస్టీలకు మూడు విభాగాల్లో లెక్క తీసుకోవటంతో జనరల్ తర్వాత ఎస్టీలకే ఎక్కువ స్థానాలు దక్కాయి. బీసీలకు అనూహ్యంగా స్థానాలు తగ్గాయి. జిల్లాలో 99 గ్రామ పంచాయతీలు షెడ్యూల్ ఏరియా (1/70 చట్టం పరిధి)లో ఉన్నందున అక్కడి సర్పంచి పదవులన్నీ ఎస్టీలకు కేటాయించారు. వార్డుల్లో మాత్రం కొన్ని గిరిజనేతరులకు దక్కాయి. మరో 11 గ్రామ పంచాయతీల్లో 100 శాతం ఎస్టీ జనాభా ఉన్నందున ఆ సర్పంచి స్థానాలన్నీ ఎస్టీలకే రిజర్వ్ అయ్యాయి. వార్డుల్లో మాత్రం కొన్ని గిరిజనేతరులకు వచ్చాయి. ఇలా 110 గ్రామ పంచాయతీల్లో లెక్కలు తీశారు. మిగిలిన 461 పంచాయతీల్లో ఎస్టీలకు 9 శాతం కోటా కల్పించారు. దీంతో ఎస్టీలకు మూడు విభాగాల్లో రిజర్వేషన్లు దక్కాయి. ఇక ఎస్సీలకు 18 శాతం చొప్పున, బీసీలకు 23 శాతం చొప్పున స్థానాలు రిజర్వ్ చేశారు. మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీలో ఉంచారు. ఈ స్థానాల్లో ఎవరైనా పోటీ చేసే వీలుంది. అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు లాటరీ పద్ధతిలో కేటాయించారు. 2019లో నిర్వహించిన మొదటి సాధారణ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన పద్ధతినే అనుసరించినా, రెండో సాధారణ ఎన్నికలకు రొటేషన్ పద్ధతి అవలంబించారు. డిసెండింగ్ విధానం అనుసరించారు.

# కనిపెట్టు.. చిప్ కనికట్టు!

తల్లాడ : జగ్గయ్యపేట, తల్లాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ చిప్ ఏర్పాటు చేసిన కాటాలను రూ.30వేల నుంచి రూ.50వేల వరకు విక్రయిస్తున్నారు. పత్తి సాగుకు ఉభయ జిల్లాలు పెట్టింది పేరు. ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటూ ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతులను కొందరు దళారులు ఎలక్ట్రానిక్ కాటాల రూపంలో మోసం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని తల్లాడ, ఏన్కూరు మండలాలకు చెందిన కొందరు దళారులు మినీ వ్యాన్‌ల ద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాలకు వెళ్లి ఎలాంటి అనుమతులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వారు వినియోగించే ఎలాక్ట్రానిక్ కాటాల్లోనే అసలు మోసం దాగుంది. ఇటీవల తల్లాడ, ఏన్కూరు పోలీసులు దాడులు నిర్వహించి బైండోవర్ కేసులు నమోదు చేశారు. రైతులు అప్రమత్తంగా వ్యవహరించకుంటే తూకాల పేరుతో మరిన్ని నష్టాలు తప్పవు.

**రిమోట్‌తో నియంత్రిస్తున్నారిలా..**అక్రమార్కులు నాలుగు చక్రాల ఆటోలు, మినీ వ్యాన్లలో వివిధ ప్రాంతాలకు వెళ్లి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వీరు వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాలలో ముందే అమర్చిన చిప్‌లు ఉంటున్నాయి. రిమోట్‌కు అనుసంధానమైన ఈ చిప్‌ల సాయంతో దళారులు దండుకుంటున్నారు. కారు తాళం రూపంలో రిమోట్ నొక్కగానే వారు అమర్చిన మేరకు తక్కువ తూకం నమోదవుతుంది. పత్తిని ఎలక్ట్రానిక్ తూకంపై పెట్టినప్పుడు ఒక దళారీ తన దగ్గర ఉంచుకున్న రిమోట్‌ను నొక్కడం ద్వారా పత్తి తూకం తక్కువగా చూపుతుంది. దీంతో రైతులు క్వింటాకు 15నుంచి 20కిలోలు మోసపోతున్నాడు. మామూలు సమయంలో ఎలక్ట్రానిక్ కాటా తూకం కచ్చితంగానే కనిపిస్తుంది. కానీ సరకు కాటామీద పెట్టాక రిమోట్ నొక్కడం ద్వారా తక్కువ తూకం చూపించి రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. 'రైతులు కాటాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అనుమతి లేని దళారులకు విక్రయించవద్దు. నమ్మకమైన వేబ్రిడ్జి వద్ద తూకం వేయించుకోవాలి. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులు, తూనికలు కొలతల అధికారులకు సమాచారం ఇవ్వాలి.' ఎన్.వెంకటకృష్ణ, తల్లాడ ఎస్సై



# అమరావతిలో విద్యార్థుల మాక్ అసెంబ్లీ

అమరావతి: అమరావతిలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దీనికి ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హాజరయ్యారు. మాక్ అసెంబ్లీలో సీఎంగా మన్యం జిల్లాకు చెందిన ఎం.లీలా గౌతమ్, ప్రతిపక్ష నేతగా మన్యం జిల్లాకు చెందిన సౌమ్య, డిప్యూటీ సీఎంగా విశాఖ జిల్లాకు చెందిన కోడి యోగి, విద్యాశాఖ మంత్రిగా తిరుపతి జిల్లాకు చెందిన చిన్మయి, స్పీకర్‌గా కాకినాడ జిల్లాకు చెందిన స్వాతి వ్యవహరించారు. మాక్ అసెంబ్లీలో సామాజిక మాధ్యమాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ బిల్లులపై స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. 45 వేల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది శక్తిమంతమైన పునాది అన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణం, వికసిత భారత్ లక్ష్య సాధనలో రాజ్యాంగమే మార్గదర్శకమని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

మన హక్కులకు పెద్ద దిక్కుగా నిలిచిన రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామని చెప్పారు. రాజ్యాంగ దినోత్సవాన్ని విద్యాశాఖ వినూత్నంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు వివరించారు.



# కోనసీమ కొబ్బరి రైతుల గొంతుకనవుతా

కోనసీమ: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించారు. శంకరగుప్తం డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరి తోటల రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

కేశనపల్లిలో కొబ్బరి రైతులతో మాట్లాడుతూ.. ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సమస్య మూలాల నుంచి కేంద్రం సహకారం వరకు కృషి చేస్తానని చెప్పారు. కోనసీమ కొబ్బరి రైతుల గొంతుకనవుతానన్నారు. "రూ.22 కోట్ల నిధులు ఇచ్చి హడావుడి చేసి వెళ్లిపోయేందుకు నేను రాలేదు. సంక్రాంతి తర్వాత కోనసీమ అంతా డ్రెయిన్ల సమస్య పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తాం. గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పులను కరెక్ట్ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు తెలియజేస్తున్నాం. అబద్ధపు మాటలు చెబితే యువత నమ్మరు" అని పవన్ అన్నారు. ఈ సందర్భంగా అధికారులను డిప్యూటీ సీఎం సున్నితంగా హెచ్చరించారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై అధికారుల నివేదికను చదివి వినిపించారు. "కోనసీమ కొబ్బరి రైతుల సమస్యపై పూర్తి అవగాహన ఉండాలి. శంకరగుప్తం డ్రెయిన్‌కు ఉన్న ఆక్రమణలపై అధికారులు ఎందుకు దృష్టి పెట్టలేదు. గతంలో ఇరిగేషన్ నిపుణుడు రోశయ్య కమిటీ ఇచ్చిన నివేదికను పక్కన పెట్టేశారు" అని పవన్ అన్నారు.



# విజన్ ఉంటే సరిపోదు.. దాన్ని అమలు చేయడం ముఖ్యం

అమరావతి: ప్రజల గుండెల్లో అంబేద్కర్ శాశ్వతంగా ఉండిపోతారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అమరావతిలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "విజన్ ఉంటే సరిపోదు.. దాన్ని అమలు చేయడం ముఖ్యం. నిరంతర శ్రమతోనే అనుకున్నది సాధించగలం. సరైన నిర్ణయాలు తీసుకుంటేనే ఏదైనా సాధ్యమవుతుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని ముందుకు వెళ్లాలి. చిన్న వయసులోనే నేను ఎమ్మెల్యే అయ్యాను. నాలుగో సారి సీఎంగా పనిచేస్తున్నాను. మాక్ అసెంబ్లీలో విద్యార్థులు చాలా బాగా మాట్లాడారు. విద్యార్థులు ఎక్కడా తడబడలేదు.


బాధ్యత గుర్తుపెట్టుకునేలా.. స్ఫూర్తినిచ్చేలా మాక్ అసెంబ్లీ నిర్వహించారు" అని సీఎం కొనియాడారు.




# పిల్లలకు అర్థమయ్యేలా పుస్తక రూపంలో బాలల భారత రాజ్యాంగం: లోకేష్

అమరావతి : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీ డ్రిల్ అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యార్థులతో మాక్ అసెంబ్లీని మెయిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేయాలని అకున్నామని తెలిపారు. అయితే రూల్స్ పర్మిట్ చేయవని స్పీకర్ చెప్పడంతో పాటు అసెంబ్లీ ప్రాంగణంలోనే ఈ కార్యక్రమం నిర్వహిద్దామని అన్నట్లు చెప్పారు. ఈ మాక్ అసెంబ్లీ ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. భారత రాజ్యాంగాన్ని అడాప్ట్ చేసుకున్న రోజు ఈ రోజు అని.. అందుకే పిల్లలకు అర్థం అయ్యే రీతిలో బాలల భారత రాజ్యాంగాన్ని పుస్తక రూపంలో తెచ్చామని అన్నారు. రాజ్యాంగం భారత దేశపు ఆత్మ అని.. అందుకే మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలామ్ అజాద్ వంటి వారి గురించి ఈ పుస్తకంలో ఉంచామని వెల్లడించారు. పిల్లల సక్సెస్‌లో తల్లిదండ్రుల కృషి ఎంతో ఉంటుందన్నారు. నైతిక విలువలపై చాగంటి కోటేశ్వరరావు చెప్పినది ఎంతో మంచి మాటన్నారు. చేసిన పనిని ధైర్యంగా తల్లికి చెప్పగలిగితే అందరూ మంచి పౌరులుగా మారుతారని చాగంటి అన్నారని.. ఇదే విషయం ముఖ్యమంత్రికి కూడా తాను చెప్పినట్లు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావుకు క్యాబినెట్ ర్యాంకు ఇచ్చి సలహాదారుగా నియమిస్తే.. ఒక్క రూపాయి కూడా వద్దని ప్రభుత్వ బాధ్యతను తన డబ్బులతోనే నిర్వహిస్తామని ఆయన చెప్పారని తెలిపారు. పిల్లల కోసమే ప్రతి ఒక్కరం కష్టపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నామని... చాలా వరకూ సాధించామన్నారు. పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. 'క్రమశిక్షణ పట్టుదల నాలో ఉందంటే నా తల్లి భువనేశ్వరినే కారణం.. మిమ్మల్ని మీ తల్లి దండించిందో లేదో తెలియదు. నేను తప్పు చేస్తే నా తల్లి దండించింది... చిన్న తప్పు మాట్లాడితే వెంటనే మెసేజ్ చేస్తుంది' అని తెలిపారు. గాజులు తొడుక్కున్నావా, అమ్మాయిలా ఏడుస్తావా అంటూ మహిళలను కించపరిచే మాటలు ఎవ్వరూ వాడొద్దన్నారు. పుస్తకాల్లో ఉంటే చాలదని.. అమలులో ఉండాలని మంత్రి అన్నారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ లైవ్‌ను విద్యార్థులు చూస్తున్నారని తెలిపారు. చర్చ వాస్తవాలతో జరగాలని... గొడవలతో కాదన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభించినప్పుడు రాజ్యాంగం కాపీని చేతపట్టి పాదయాత్ర చేసినట్లు తెలిపారు. తన హక్కుల గురించి పోలీసులను అడిగితే తెలియదంటూ సమాధానం చెప్పారని.. ఎస్పీని అడగమన్నారని గుర్తుచేశారు. చిన్నతనం నుంచి రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరికి తెలిసేలా చేయాలని ఆనాడే నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా రాష్ట్రాన్ని, దేశాన్ని గర్వపడేలా చేయాలని విద్యార్థులకు మంత్రి లోకేష్ సూచించారు.

# బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడే అవకాశం



అమరావతి: నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక, హిందూ మహాసముద్రం పరిసర ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమైంది. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ గురువారం వాయుగుండంగా బలపడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆ తరువాత 48 గంటల్లో ఇది ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు కదులుతూ మరింత బలపడే అవకాశముందని పేర్కొన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో రేపు.. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 35 నుంచి 55 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని పేర్కొన్నారు.

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణశాఖ సూచించింది. మలక్కా జలసంధి, ఇండోనేషియాను ఆనుకుని ఉన్న 'సెన్యార్' తుపాను తీరం దాటిందని వెల్లడించింది.

# వైకుంఠద్వార దర్శనాలు.. ఏడు రోజులు సామాన్య భక్తులకు పెద్దపీట: తితిదే ఛైర్మన్



తిరుమల: తిరుమలలో డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై ఆయన బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. 10 రోజుల్లో 7 రోజులు టోకెన్లు లేకుండా అనుమతి ఉంటుందన్నారు. తొలి 3 రోజులు మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి దర్శనం కల్పిస్తామని తెలిపారు. మిగిలిన ఏడు రోజులు సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్నారు. "జనవరి 2 నుంచి 8 వరకు రోజుకు 15 వేల చొప్పున ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కల్పిస్తాం. రోజుకు 1000 శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు అందుబాటులో ఉంటాయి. పది రోజులు ప్రత్యేక, వీఐపీ బ్రేక్, చంటి పిల్లల దర్శనాలు రద్దు చేశాం. డిసెంబర్ పదో తేదీన స్థానికుల దర్శన కోటా విడుదల చేయనున్నాం. తిరుపతి, తిరుమల, రేణిగుంట, చంద్రగిరి స్థానికులకు రోజుకు 5 వేల టోకెన్లు అందజేస్తాం. డిసెంబర్ ఐదో తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవాణి దర్శన కోటా, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు రూ.300 దర్శన కోటా విడుదల చేస్తాం" అని బీఆర్ నాయుడు అన్నారు.

# జగన్ నిరూపిస్తే.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తా: భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

అమరావతి: అరటి పంటకు గత ఐదేళ్లలో బీమా చెల్లించినట్టు జగన్ నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని.. నిరూపించకపోతే ఆయన రాజీనామా చేస్తారా? అని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సవాల్ విసిరారు. జగన్.. పులివెందుల రైతుల వెన్ను విరిచాడని మండిపడ్డారు.

2019–24 మధ్య రాయలసీమకు అదనంగా ఒక్క ఎకరాకు నీరు ఇచ్చినట్లు జగన్ చూపగలరా అని ప్రశ్నించారు.

త్వరలోనే అరటి రైతుల సమస్య పరిష్కారమవుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. 2019–24 మధ్య రైతు ఆత్మహత్యలు ఎక్కువగా ఎందుకు జరిగాయో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పంట విస్తీర్ణం పెరిగి, ఉత్తరాది నుంచి ఎక్కువ దిగుబడి రావటం కారణంగా అరటి రైతులు తాత్కాలిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జగన్ అరాచకాల వల్లే



పులివెందుల బనానా ప్రాసెసింగ్ యూనిట్ మనుగడలోకి రాలేదని చెప్పారు. జగన్ అసెంబ్లీకి వస్తే అన్ని వాస్తవాలు బయటపెడతామన్నారు.




అమలాపురం, నవంబర్ 26: కూటమి ప్రభుత్వానికి 15 ఏళ్ల సమయం ఇవ్వాలని ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. కొబ్బరిచెట్టును పెద్దకొడుకుగా ఎలా భావిస్తారో.. అలాగే కూటమి ప్రభుత్వాన్ని భావించాలని ప్రజలను ఆయన కోరారు. బుధవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని శివ కోడులో పల్లె పండుగ 2.0 పేరిట బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ రోజుకి వైసీపీ నేతలు బూతులు, బుద్ధులు మారడం లేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా విమర్శించండి.. సరిదిద్దుకుంటామంటూ వైసీపీ నేతలకు పవన్ కల్యాణ సూచించారు. సోషల్ మీడియా వేదికగా వైసీపీ నేతలు చేస్తున్న కామెంట్స్ గమనిస్తున్నామన్నారు.

తీరు మారకపోతే పవన్ కల్యాణ్‌లో గట్టిదనం చూస్తారంటూ వైసీపీ నేతలను హెచ్చరించారు. 2029లో అధికారంలోకి వచ్చేస్తామంటూ వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని.. రాజోలు గడ్డ మీద నుంచి చెబుతున్నా అది జరగదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ పార్టీలో ఎవరు తప్పు చేసినా తాను క్షమించనన్నారు. గ్రామ సమస్యలపై నిలదీయాలంటూ ఈ సందర్భంగా యువతకు పవన్ కల్యాణ్ సూచించారు.

**పల్లె పండుగ..** 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలకు ఏపీ ఓటరు పట్టం కట్టాడు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. దాంతో గతేడాది ఇదే సమయంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద దాదాపు రూ. 4,500 కోట్ల వ్యయంతో 30 వేల పనులను ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని కొనసాగింపుగా ఈ ఏడాది కూడా పల్లె పండగ 2. 0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఏడాది రూ. 6,500 కోట్ల వ్యయంతో 52,000 పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది.

# తిరుమల పరకామణి కేసు.. మరోసారి సీఐడీ ముందుకు ధర్మారెడ్డి

అమరావతి, నవంబర్ 26: తిరుమల పరకామణి చోరీ కేసులో సీఐడీ విచారణకు టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి హాజరయ్యారు. ఈ కేసులో విచారణకు రావాల్సిందిగా సీఐడీ పిలుపు మేరకు.. ఈరోజు (బుధవారం) విజయవాడ తులసినగర్‌లోని సీఐడీ కార్యాలయంలో ధర్మారెడ్డి విచారణకు వచ్చారు. టీటీడీ మాజీ ఈవోను సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ విచారిస్తున్నారు. పరకామణి కేసులో ఇప్పటికే రెండు సార్లు ధర్మారెడ్డిని సీఐడీ విచారించిన విషయం తెలిసిందే. ఇక నిన్న ఇదే కేసులో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని సీఐడీ ప్రశ్నించింది. ఈ కేసుకు సంబంధించి పలువురు అధికారులను విచారించిన అనంతరం ధర్మారెడ్డిని మరోసారి సీఐడీ విచారణకు పిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీటీడీ పరకామణి కేసులో దర్యాప్తు అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి గత ఈవోలు, ఛైర్మన్లను అధికారులు విచారించారు. ప్రస్తుతం టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ మూడో సారి ప్రశ్నిస్తోంది. ప్రధానంగా పరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని రక్షించేందుకు గత ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులే దగ్గరుండి వ్యవహారాన్ని నడిపించారని, చివరకు కేసు పెట్టినా కూడా లోక్‌అదాలత్‌లో కొట్టివేసే విధంగా ఒత్తిడి తెచ్చారని, దీనికి సంబంధించి లక్షల్లో చేతులు మారాయనే అభియోగాలు ఉన్నాయి. ఈ క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు అధికారులు విచారిస్తున్నారు. గతంలో ధర్మారెడ్డిని రెండు సార్లు విచారించిన సీఐడీ అధికారులు.. ఆయన చెప్పిన విషయాలను రికార్డ్ చేశారు. అలాగే టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిని విచారించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా పరకామణి కేసులో ఫిర్యాదుదారుడు సతీష్ కుమార్ మరణం కూడా మిస్టరీగా మారింది. దీంతో పరకామణి వ్యవహారం బయటకు వచ్చినప్పటి నుంచి.. ఎవరెవరు ఇందులో పాత్రధారులుగా ఉన్నారు?.. ఎవరెవరు ఏ అంశాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి నిందితులను రక్షించేందుకు ప్రయత్నించారనే అంశాలపై విచారణ అధికారులు ఆరా తీస్తున్నారు.

# సుప్రీంకోర్టులో లిక్కర్ కేసు నిందితులకు ఊరట

ఢిల్లీ, నవంబరు 26 : ఆంధ్రప్రదేశ్ లిక్కర్ కేసు నిందితులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో సుప్రీంకోర్టును నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప ఆశ్రయించారు. న్యాయస్థానంలో నిందితులు వేసిన పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. ఈ క్రమంలో సరెండర్ నుంచి నిందితులకు మినహాయింపు ఇచ్చింది న్యాయస్థానం. 10 రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని సిట్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిజైండర్ దాఖలు చేసేందుకు ఐదు రోజుల సమయం కోరారు నిందితుల తరపు న్యాయవాదులు. డిసెంబరు 15వ తేదీకి కేసు విచారణ వాయిదా వేసింది. ఇటీవల లిక్కర్ కేసులో ఏపీ హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును లిక్కర్ కేసు నిందితులు ఆశ్రయించిన విషయం తెలిసిందే.

## మళ్లీ మత్తులోకి దించిన చికిరీ

'లోఫర్' బ్యూటీ దిశా పటానీ అన్ లిమిటెడ్ గ్లామర్ ట్రీట్ ఎప్పుడూ యూత్ లో ట్రెండ్ గా మారుతుంది. దిశాకు సోషల్ మీడియా సహా ఇంటర్నెట్ లో అసాధారణ ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. ఇన్ స్టా, ఎక్స్ ఖాతాలు సహా చాలా వేదికలపై దిశా పటానీ ఫోటోగ్రాఫ్స్ , వీడియోలు నిరంతరం ట్రెండింగ్ లో ఉన్నాయి. ఇక దిశాను ఇన్ స్టాలో దాదాపు 63లక్షల మంది అనుసరిస్తున్నారు. వీళ్లందరి కోసం దిశా నిరంతర ఫోటోట్రీట్ సిద్ధంగా ఉంటుంది. ఇటీవల కెల్విన్ క్లెయిన్ బ్రాండ్ కి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను దిశా ప్రచారం చేస్తోంది. సీకే బ్రాండ్ లేటెస్ట్ వెర్షన్ వాచ్ లను కూడా మార్కెట్లోకి దించుతూ దిశాతో ప్రచారం చేయించుకుంది. ఇక దిశా ఎప్పటిలాగే మైండ్ బ్లాక్ చేసే ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. ఇటీవల వరుసగా బాడీ హగ్గింగ్ డిజైనర్ దుస్తులతో గుబులు పుట్టిస్తోంది. ఈ సిరీస్ లో ఇప్పుడు ఒక కొత్త ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది.



తాజాగా ఈ బ్యూటీ క్రిస్టల్స్, మిర్రర్ అల్లికలతో అందమైన డిజైనర్ ఫ్రాక్ ని ధరించి రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. బంగారు రంగు బాడీ హగ్గింగ్ ఫ్రాక్ నెవ్వర్ బిఫోర్ ట్రీట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. బ్యాక్ లెస్ .. షోల్డర్ లెస్ ఎలివేషన్ తో ఈ డిజైనర్ ఫ్రాక్ ని తీర్చిదిద్దిన విధానం, మిర్రర్ వర్క్ ప్రతిదీ సంథింగ్ స్పెషల్ గా కుదిరాయి అనడంలో సందేహం లేదు. నటిగా కెరీర్ మ్యాటర్ కి వస్తే, టాలీవుడ్ లో లోఫర్ చిత్రంలో నటించిన దిశా పటానీ, ఆ తర్వాత ఎంఎస్ ధోని బయోపిక్ లో నటించింది. కానీ హిందీ చిత్రసీమలోనే ఎక్కువ సినిమాలకు సంతకాలు చేసింది. కానీ అక్కడా ఆశించిన విజయాలు దక్కలేదు. గడిచిన రెండేళ్లలో సౌత్ లో వరుస చిత్రాలతో బిజీ అయింది. ప్రభాస్ సరసన కల్కి చిత్రంలోను కీలక పాత్రను పోషించింది. సూర్య కంగువ లోను దిశా ఓ ఆసక్తికర పాత్రలో కనిపించింది. అయితే లోఫర్ నుంచి కల్కి 2898 ఏడి వరకూ దిశా ప్రయాణంలో ఆశించినన్ని విజయాలు లేవు. అయినా ఈ బ్యూటీ కి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. దీనికి తోడు నిరంతరం సోషల్ మీడియా క్వీన్ గా హృదయాలను ఏలుతూనే ఉంది. సినిమాలతో ఆదాయం ఎలా ఉన్నా సోషల్ మీడియా యాడ్స్, ఇతర వాణిజ్య ప్రకటనలు, ఫ్యాషన్ ఈవెంట్లతోను అదనంగా ఆర్జిస్తోంది.

## సక్సెస్ మంత్రం తెలుసిన సిసలైన డైరెక్టర్..!

టాలీవుడ్ లో అసలు ఫ్లాపులు లేని డైరెక్టర్ అంటే అందరు రాజమౌళి పేరు చెబుతారు. ఆయనతో పాటు ఎంటర్టైనింగ్ సినిమాలతో ఓటమి ఎరుగని ధీరుడిగా రాజమౌళి తర్వాత ప్లేస్ సంపాదించాడు డైరెక్టర్ అనిల్ రావిపూడి. పటాస్ నుంచి సంక్రాంతికి వస్తున్నాం సినిమా వరకు అనిల్ రావిపూడి సినిమా అంటే చాలు ఎంటర్టైన్మెంట్ పక్కా అని ఆడియన్స్ ఫిక్స్ అయ్యాడు. పటాస్, సుప్రీం, రాజా ది గ్రేట్ తర్వాత స్టార్ ఛాన్స్ లను కూడా సూపర్ గా హ్యాండిల్ చేసి సరిలేరు నీకెవ్వరు అంటూ మహేష్ తో కలిసి సినిమా హిట్ అందుకున్నాడు అనిల్ రావిపూడి.

**ఎలాంటి సినిమా ఇస్తే..** ఆయన సినిమాల్లో కామెడీ ఉంటుంది.. అది ఆడియన్స్ ని సూపర్ గా ఎంటర్టైన్ చేస్తుంది. సక్సెస్ మంత్రం తెలిసిన డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఎందుకంటే ఆడియన్స్ కి ఎలాంటి



సినిమా ఇస్తే వారు హిట్ చేస్తారు అన్నది బాగా నేర్చుకున్నాడు. ఎంటర్టైన్మెంట్ సినిమాలతో ప్రతిసారి మెప్పించడం చాలామంది ఫెయిల్ అవుతుంటారు. కానీ అనిల్ రావిపూడి మాత్రం హిట్లు మీద హిట్లు కొడుతూనే ఉంటాడు. అనిల్ రావిపూడి సినిమాల్లో ఆడియన్స్ కి బాగా నచ్చే మరో అంశం సినిమా ప్రమోషన్స్. ఒక సినిమాను ఎలా ప్రమోట్ చేస్తే ఆడియన్స్ కు రీచ్ అవుతుందో అతనికి బాగా తెలుసు. ప్రమోషన్స్ లో హెడ్ మాస్టర్ టైప్ యాక్టివిటీస్ చేస్తూ ఆడియన్స్ ని సినిమాకు ఎంగేజ్ చేస్తుంటాడు అనిల్ రావిపూడి. ఇక ఎంచుకున్న కథకు తగినట్టుగా మిగతా మేళవింపులు అన్నీ ఉన్నా కూడా తన బలమైన కామెడీ మీద గట్టి ఎఫర్ట్ తో వస్తాడు. సో అక్కడ ఆడియన్స్ ఫిదా అయిపోతారు. తనపై వస్తున్న విమర్శలను కూడా పాజిటివ్ గా చేసుకునేలా పనిచేస్తూ ఉంటాడు అనిల్ రావిపూడి. అఫ్కోర్స్ ఆయన చేసే కామెడీ కొంతమందికి ఎక్కకపోతే చేసే ప్రతి విమర్శలు కూడా ఆయన రిసీవ్ చేసుకుని ముందుకు వెళ్తున్నారు.

**మెగాస్టార్ చిరంజీవితో మన శంకర వరప్రసాద్..** అందుకే అనిల్ రావిపూడి సూపర్ హిట్ డైరెక్టర్ గా క్రేజ్ తెచ్చుకున్నాడు. ప్రస్తుతం అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవితో మన శంకర వరప్రసాద్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో మరో హిట్ కొట్టాలని ఫిక్స్ అయ్యా డు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సంక్రాంతికి బ్లాక్ బస్టర్ అందు కున్న అనిల్ రావిపూడి నెక్స్ట్ సంక్రాంతికి కూడా మరో సెన్సేషనల్ హిట్ కోసం ప్లాన్ చేశాడు. సో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ గా ఆడియన్స్ కు ఫుల్ ఆన్ ఎంటర్టైన్మెంట్ అందిస్తున్న అనిల్ రావిపూడి బర్త్ డే ఈరోజు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని.. ఇంకా ఎన్నో కామెడీ ఎంటర్టైనర్స్ తో అలరించాలని కోరుకుంటూ హ్యాపీ బర్త్ డే డైరెక్టర్ అనిల్ రావిపూడి.




## ఆ స్టార్ హీరో ఈసారి పాత పద్ధతిలోనా?



కోలీవుడ్ స్టార్ సూర్య సరైన సక్సస్ అందుకుని చాలా కాలమవుతోంది. జైభీమ్ తర్వాత సరైన సక్సెస్ ఒక్కటీ పడలేదు. జైభీమ్ కూడా ఓటీటీ రిలీజ్ కావడంతో థియేట్రికల్ గా ఆడియన్స్ దూరంగానే కనిపించింది. కానీ ఆ సినిమాతో సుర్యకు వచ్చిన గుర్తింపు మాత్రం ఎంతో ప్రత్యేకమైనది. ఆ తర్వాత వరుసగా రిలీజ్ అయిన నాలుగైదు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ప్రత్యేకించి ఆ సినిమా రిలీజ్ లు కూడా అన్నీ తమిళ టైటిల్స్ తో తెలుగు లో రిలీజ్ అయ్యాయి. టైటిల్ మార్చిల్సిన ఆవశ్యకత లేకపోవడంతో అదే టైటిల్ తో ఏక కాలంలో రిలీజ్ చేసారు.

**తెలుగులో తమిళ టైటిల్స్ వాసన:** ఈటీ,కంగువ, రెట్రో లాంటి చిత్రాల టైటిల్స్ లో ఎలాంటి మార్పు కనిపించలేదు. ఈ నేపథ్యంలో తెలుగు టైటిల్ లేకుండా తమిళ సినిమా రిలీజ్ ఏంటనే విమర్శలు వ్యక్తమయ్యయాయి. అంతకు ముందు మరికొంత మంది హీరోలు నటించిన సినిమాలు కూడా ఇలాగే రిలీజ్ అయ్యాయి. దీంతో టాలీవుడ్ నుంచి కాస్త నెగివిటీ కూడా మొదలైంది. కానీ తెలుగు అభిమానులంటే సూర్య ఎంతో గౌరవిస్తారు. ఆయన్ని ఇక్కడ ఆడియన్స్ ఎంతో ఆదరిస్తారు. తమిళ అభిమానుల కంటే తనకు ఓ మెట్టు పైనే తెలుగు అభిమానులుంటారు. సూర్య లాగే కార్తీ కూడా ఇక్కడ అభిమానులకు అంతే ప్రాధాన్యత ఇస్తారు.

**పోటీ కూడా అడ్డంకిగా:** తమిళ నుంచి ఎంత మంది హీరోలున్నా? అన్నదమ్ములిద్దరు మాత్రం తెలుగు ఆడియన్స్ కు ఎంతో ప్రత్యేకం. ఆ సంగతి పక్కన బెడితే తదుపరి సినిమా రిలీజ్ విషయంలో సూర్య సంచలన నిర్ణయానికి అవకాశం ఉందా? అంటే ఉందనే చప్పొచ్చు. సూర్య నటించిన కరుప్పు సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఆ సీజన్ లో తమిళ సహా తెలుగు నుంచి చాలా సినిమాలు రిలీజ్ కు ఉండటంతో? సూర్య ఉన్న తాజా పరిస్థితుల్లో వాళ్లకు పోటీగా రావడం కంటే పోటీ లేని సమయంలోనే వస్తే బాగుంటుంది అన్న ఆలోచనతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది.

**గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో:** ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26 కరుప్పు ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారుట. అయితే ఈ సినిమాకు తెలుగు లో టైటిల్ ఉ ండాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. సూర్య గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తెలుగు అభిమానుల కోసం తెలుగు టైటిల్ తో రావాలని ఆశీస్తున్నారు. అందుకు సూర్య ఎంత మాత్రం అడ్డు చెప్పే న టుడు కాదు. గత సినిమాల వైఫల్యం నేపథ్యంలో ఈసారి తెలుగు టైటిల్ తోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మధ్యలో దర్శక , నిర్మాతలు మాతృభాషపై అతి మమకారంతో ఎలాంటి రాజకీయాలకు పాల్పడకుండా ఉంటే సాధ్యమే.

## అఖండ 2 వాళ్లకి ఎక్కిందంటే మాత్రం..?



అఖండ సక్సెస్ అవ్వడంతో బోయపాటి శ్రీను బాలయ్య అఖండ 2 తాండవం చేశారు. సింహా నుంచి ఈ కాంబో సినిమా ఎప్పుడొచ్చినా ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ ని కూడా డిజప్పాయింట్ చేయలేదు. ఆ హైప్ తోనే అఖండ 2 సినిమా వస్తుంది. ఈ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ చేయడం తో మరింత క్రేజ్ తెచ్చుకుంది. ముంబై నుంచే సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టారు మేకర్స్. డిసెంబర్ 5న రిలీజ్ అవబోతున్న అఖండ 2 సినిమా ట్రైలర్ సూపర్ క్రేజ్ తెచ్చుకుంది.

**తెలుగు రెండు రాష్ట్రాల్లో బాలయ్య క్రేజ్..** మరోసారి బాక్సాఫీస్ పై బాలయ్య తాండవం ఆడేందుకు వచ్చేస్తున్నాడని ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. ఐతే ఈ సినిమా సక్సెస్ అనిపించుకోవాలంటే దాదాపు 200 కోట్ల దాకా కలెక్ట్ చేయాలని తెలుస్తుంది. ఐతే తెలుగు రెండు రాష్ట్రాల్లో బాలయ్య క్రేజ్ తెలుసు కాబట్టి హిట్ టాక్ వస్తే కలెక్షన్స్ అదిరిపోతాయి. ఐతే ఈ భారీ టార్గెట్ రీచ్ అవ్వాలి అంటే కేవలం తెలుగు మార్కెట్ కాదు హిందీలో కూడా అఖండ 2 అదిరిపోవాలి. హిందీ బెల్ట్ లో సినిమా ఆడితేనే కలెక్షన్స్ బాగుంటాయి. అఖండ 2 సినిమా ప్రమోషన్స్ ముంబైలో మొదలు పెట్టిన రీజన్ కూడా అదే అయ్యుండొచ్చు.

ఎందుకంటే ఈమధ్య తెలుగులో తెరకెక్కిన సినిమాలు పాన్ ఇండియా రిలీజైతే హిందీలో హిట్ టాక్ తెచ్చుకుంటే చాలు కలెక్షన్స్ మోత మోగిపోతాయి. సో అఖండ 2 కూడా ఆ అంచనాలను అందుకుంటుందా అనే ఎక్స్ పెక్టేషన్స్ పెరిగాయి.

**బాలయ్య అఘోరి లుక్ తో పూనకాలు..** అదీగాక అఖండ 2 సినిమాలో బాలయ్య అఘోరి లుక్ తో పూనకాలు తెప్పించేలా ఉ న్నారు . అఖండ సినిమా హిందీ డైరెక్ట్ రిలీజ్ కాకపోయినా ఆ సినిమా డబ్బింగ్ వర్షన్ యూట్యూబ్ లో సూపర్ హిట్ అయ్యింది. ఆ బజ్ తోనే అఖండ 2 ని హిందీలో డైరెక్ట్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇక బోయపాటి శ్రీను యాక్షన్ సినిమాలకు హిందీలో చాలా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆయన తీసిన సరైనోడు, జయ జానకి నాయకా సినిమాలు యూట్యూబ్ లో రికార్డ్ వ్యూస్ రాబట్టాయి. సో బీ టౌన్ హిందీ ప్రియులకు బాగా దగ్గరైన బోయపాటి శ్రీను అఖండ 2 తాండవం తో వస్తున్నాడు కాబట్టి ఏమాత్రం సినిమా వాళ్లను టచ్ చేసినా ఊహించని రేంజ్ లో కలెక్షన్స్ వస్తాయి. సో 200 కాదు సినిమా హైప్ కి తగినట్టుగానే డివోషనల్ టచ్ ఇంకా యాక్షన్ పార్ట్ అంతా కుదిరితే మరో 100 కోట్లు తెచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. బాలయ్య కూడా అఖండ 2 తాండవంతో పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తుండగా.. నెక్స్ట్ గోపీచంద్ మలినేని సినిమాను కూడా ఇదే రేంజ్ నేషనల్ వైడ్ రిలీజ్ చేసేలా ప్లాన్ ఉందట. ఆదిత్య 999 కూడా భారీ రేంజ్ స్కెచ్ తోనే వస్తున్నారన్నట్టుగా తెలుస్తుంది.

## ఆ సినిమాకు నేషనల్ అవార్డు వచ్చినా కొత్త అవకాశాలు మాత్రం రాలేదు

మామూలుగా సినీ ఇండస్ట్రీలో ఎవరికైనా ఒక సక్సెస్ వస్తే ఆ తర్వాత ఆఫర్లు ఎలా క్యూ కడతాయో అందరికీ తెలిసిందే. కానీ ఓ స్టార్ హీరోయిన్ కు మాత్రం కెరీర్ బెస్ట్ మూవీ వచ్చాక కూడా ఆరేడు నెలల పాటూ ఎలాంటి కొత్త ఆఫర్లు రాలేదని చెప్తోంది. ఆ హీరోయిన్ ఎవరో కాదు, మలయాళ భామ కీర్తి సురేష్. ఇండియన్ మూవీ హిస్టరీలో ఇప్పటివరకు వచ్చిన బెస్ట్ బయోపిక్స్ లో సావిత్రి జీవితంపై తీసిన మహానటి సినిమా కూడా ఒకటి.

**సావిత్రితో నేషనల్ అవార్డు అందుకున్న మహానటి...** ఆ సినిమాలో సావిత్రి క్యారెక్టర్ లో ఎంతో గొప్ప యాక్టింగ్ చేసి ఆడియన్స్‌తో కన్నీళు పెట్టించిన కీర్తి సురేష్ మహానటి మూవీలో యాక్టింగ్ కు గాను నేషనల్ అవార్డు కూడా అందుకున్నారు. అప్పటివరకు సినిమాల సెలక్షన్ తో సతమతమవుతున్న కీర్తి సురేష్ కు మహానటి సినిమా కొత్త కెరీర్ ను అందించింది. ఈ సినిమాతో కీర్తి అందుకున్న సక్సెస్, క్రేజ్, నటిగా ఆమె పొందిన గుర్తింపు అంతా ఇంతా కాదు.

**మహానటి తర్వాత ఖాళీ గా ఉన్న కీర్తి...** సావిత్రి క్యారెక్టర్ లో జీవించి



మెప్పించిన కీర్తి సురేష్ మహానటి తర్వాత వరుస ఛాన్సులతో బిజీగా ఉంటుందనుకుంటే తనకు ఓ వింత ఎక్స్‌పీరియెన్స్ ఎదురైనట్టు చెప్పారు. మహానటి తర్వాత తన లైఫ్ లో ఎదురైన పరిణామాల గురించి కీర్తి రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. మహానటి తర్వాత ఇండస్ట్రీలో తన మీద అంచనాలు చాలా పెరిగాయని చెప్పారు కీర్తి. ఆ సినిమా తర్వాత తనను స్పెషల్ క్యారెక్టర్లలోనే ఆడియన్స్ ఊహించుకున్నారని, అందుకే తనకు ఆ తర్వాత రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు రాలేదని, దర్శకనిర్మాతలు కూడా తనను మహానటి లాంటి క్యారెక్టర్లలోనే ఊహించుకున్నారని, అందుకే తనకు కథలు, క్రియేటివ్ క్యారెక్టర్లు ఎక్కువగా రాలేదని, మహానటి రిలీజైన తర్వాత తనకు 6 నెలల పాటూ ఎలాంటి ఛాన్సులు రాలేదని కీర్తి చెప్పారు.

**రివాల్వర్ రీటాగా ప్రేక్షకుల ముందుకు రానున్న కీర్తి...** ఆ ఆరు నెలల్లో తనకు ఎవరూ కథలు కూడా చెప్పలేదని, ఆ గ్యాప్ ను తాను మేకోవర్ కోసం వాడుకున్నట్టు చెప్పారు కీర్తి. కొంచెం టైమ్ తీసుకుని ఓపికగా వ్యవహరించాక కీర్తికి మళ్లీ ఛాన్సులు వచ్చి, స్టార్ హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్ గా మారగా, కీర్తి నటించిన రివాల్వర్ రీటా నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొన్నాళు గా సినిమాల విషయంలో కాస్త బ్రేక్ తీసుకున్న కీర్తికి ఈ సినిమా సక్సెస్ ఎంతో కీలకం కానుంది.

## డాల్ఫిన్ల స్వర్గంలో పాలకోవా బ్యూటీ

పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. ఆదిపురుష్ ఫేం సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేస్తోందన్న పుకార్ల నడుమ పాలక్ దేశమంతా ఫేమస్. బుల్లితెర నటి శ్వేతా తివారీ నటవారసురాలిగాను సుపరిచితురాలు. పాలక్ తన బోయ్ ఫ్రెండ్ ఇబ్రహీంతో సెలబ్రేషన్స్ కారణంగా విమర్శల్ని కూడా ఎదుర్కొంటోంది. ఈ బ్యూటీ డేటింగుల కంటే, సినిమా కెరీర్ పై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అందాల పాలక్ కి సామాజిక మాధ్యమాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. ఇన్‌స్టాలో 48 లక్షల (4.8 మిలియన్ల)కు పైగా అనుచరులున్నారు. పాలక్ వరుస ఫోటోషూట్లు హీటెక్కిస్తూనే ఉన్నాయి. ఇంతకుముందు మారిషస్ బీచ్ లలో చిలౌట్ చేసిన ఫోటోషూట్లను షేర్ చేసిన పాలక్ ఇప్పుడు ఆస్ట్రేలియాలోని ఎగ్జోటిక్ లొకేషన్లలో ఎంజాయ్ చేస్తున్న కొన్ని అందమైన ఫోటోగ్రాఫ్స్ ని షేర్ చేసింది. ఆస్ట్రేలియాలో ఫేమస్ రిసార్ట్స్ ప్రత్యేకత గురించి చెప్పింది పాలక్. అక్కడ సముద్రపు అంచులో డాల్ఫిన్స్ నేరుగా




మనుషులతో స్నేహం చేస్తాయని కూడా వెల్లడించింది. అంతేకాదు.. పాలక్ ఒక చిన్న చేపపిల్లను డాల్ఫిన్ కి ప్రేమగా తినిపించింది. అది ఆ బుల్లి చేపపిల్లను గొంతులో వేసుకుని నీళ్లలోనే పాలక్ మోకాలిపై ఒక ముద్దు కూడా ఇచ్చి వెళ్లింది. ప్రస్తుతం ఈ ఎగ్జోటిక్ లొకేషన్ నుంచి ఫోటోషూట్ ని పాలక్ నేరుగా తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ఇదే ఫోటోషూట్ లో బీచ్ ఇసుకలోకి ఏటవాలుగా ఒరిగిపోయిన ఒక భారీ కొబ్బరి చెట్టు వద్ద పాలక్ బికినీ ఫోటోషూట్ గుబులు రేపుతోంది. ఇందులో ఫ్లోరల్ మోనోకినిలో పాలక్ అందచందాలు హీట్ పుట్టిస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే... పాలక్ రోమియో S3` అనే చిత్రంతో అభిమానుల ముందుకు వచ్చింది. అంతకుముందు సల్మాన్ భాయ్ కిసీ కా భాయ్ కిసీకి జాన్ చిత్రంలో నటించింది. భూత్నీ అనే హారర్ చిత్రంలోను పాలక్ నటించింది. కానీ ఇవేవీ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఇటీవల పాలక్ యువహీరో ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేయడంపై తన తండ్రి (శ్వేతా తివారీ మాజీ భర్త) స్పందిస్తూ, డేటింగ్ కంటే నటనపై దృష్టి సారించాలని సూచించారు.




# సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లపై హైకోర్టులో పిటిషన్లు.. నేడే విచారణకు

హైదరాబాద్ : తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలకు ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ చేసిన వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించ చలేదంటూ పలువురు గ్రామస్థుల ఇవాళ పిటిషన్లు దాఖలు చేశారు. వెల్దండ తిమ్మనోనిపల్లి వార్డుల రిజర్వేషన్ల ఖరారుపై, వరంగల్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లోనూ రిజర్వేషన్లను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై హైకోర్టు రేపు విచారణ జరపనుంది. అయితే ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ కొనసాగనున్న వేళ హైకోర్టు నిర్ణయం ఉత్కంఠ రేపుతోంది. బీసీల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని ఇటు బీసీ సంఘాలు అటు ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న వేళ హైకోర్టులో ఈ పిటిషన్లు దాఖలు కావడం హాట్ టాపిక్‌గా మారింది.




# కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పవర్‌స్కామ్‌కు తెరలేపింది: హరీశ్‌రావు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.50వేల కోట్ల పవర్‌స్కామ్‌కు తెరలేపిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో పవర్ ప్లాంట్ల ఏర్పాటుతో 30, 40శాతం కమీషన్లు తీసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. "రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏం చేసినా ఒక మిషన్ ఉంటుంది.. ఆ మిషనే కమీషన్. కమీషన్లు ఎలా కొల్లగొట్టాలి అని మాత్రమే ఆయన ప్రభుత్వం ఆలోచిస్తోంది. వాటాల పంపిణీ విషయంలో మంత్రులు ఘర్షణ పడుతున్నారు. మంత్రుల కుటుంబ సభ్యులే బయటకు వచ్చి వాటాల అంశంపై చెబుతున్నారు. రాష్ట్రాన్ని అరాచకాలకు కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారుస్తోంది. కొత్తగా పాల్వంచ, రామగుండం, మక్తల్‌లో 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి రూ.50వేల కోట్లు అవసరం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.10వేల కోట్లు చెల్లించాలి. అప్పుగా రూ.40వేల కోట్లు తేవాలి. ఈ అప్పు ఎక్కడి నుంచి తెస్తారు?"అని హరీశ్‌రావు నిలదీశారు.

# హైదరాబాద్‌లో శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్‌ను ప్రారంభించిన మోదీ



హైదరాబాద్: హైదరాబాద్‌లో శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఫెసిలిటీని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాఫ్రాన్ సంస్థకు కేంద్రం సహాయ సహకారాలు అదస్తుందని చెప్పారు. కొన్నేళ్లుగా ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇప్పటికే భారత్ 1500 ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డర్ ఇచ్చిందని వివరించారు.

ఎయిర్‌క్రాఫ్ట్‌ల సర్వీస్ సెంటర్ భారత్‌లో ఏర్పాటు కావడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించే విధానంలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కొన్ని రంగాల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించినట్లు చెప్పారు.

**ఏరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి...** శాఫ్రాన్ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇది నగర అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని చెప్పారు. ఏరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతోందని వివరించారు. ఏవియేషన్ రంగానికి చెందిన ఎన్నో సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నాయని, ఎంతో మంది నిపుణులు ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. శాఫ్రాన్ సంస్థకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**భవిష్యత్తులో ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ ఖర్చు భారీగా తగ్గుతుంది: రామ్మోహన్ నాయుడు...** శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ ఖర్చు భారీగా తగ్గుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. దీని వల్ల ఆ లాభం ప్రయాణికులకు కూడా బదిలీ అవుతుందని పేర్కొన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కోసం సింగపూర్, మలేసియా వంటి దేశాలపై అధికంగా ఆధారపడుతున్నట్లు తెలిపారు. భారత్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్ వల్లే ఇది సాధ్యమవుతోందని వివరించారు. హైదరాబాద్ నగరం ఏవియేషన్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు.




హైదరాబాద్: తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శమంటూ రాహుల్ గాంధీ గొప్పగా చెప్పారంటూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు.. రూ.160 కోట్లు ఖర్చు చేశారు. కానీ పంచాయతీ ఎన్నికల్లో వారికి కేవలం 17 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. బీసీలకు ఉన్న 24 శాతాన్ని 17 శాతానికి తగ్గించారు. రిజర్వేషన్ల తగ్గింపు, ప్రజాధనం దుర్వినియోగంపై రాహుల్ గాంధీ స్పందిస్తారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# బీసీలకు మోసం జరుగుతుంటే.. బీఆర్ఎస్ నుంచి నో రియాక్షన్: కవిత



హైదరాబాద్, నవంబర్ 26: అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్వయంగా జిల్లా కలెక్టర్లే చెబుతున్నారన్నారు. బీసీ జనాభాను కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా 5 శాతానికి పైగా బీసీ జనాభా తగ్గించి చూపించారని చెప్పారు. 21శాతం మాత్రమే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికలతో జనం బాట కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు గ్రేటర్ పరిధిలో జనం బాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కాలేదన్నారు. ఏదైనా ఆరోపణలు చేస్తే.. అర్థం పర్థం ఉండాలని పేర్కొన్నారు. తాను ఎవరిపై నో ఆరోపణలు చేస్తే.. మహేశ్వరరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన ఆరోపణలపై స్పందించి.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంచి ఒరవడికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆక్రమించిన భూమి తనకెందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రజలకు ఇస్తే సరిపోతుందని కవిత తెలిపారు.




# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన నవీన్ యాదవ్

హైదరాబాద్, నవంబర్ 26: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈరోజు (బుధవారం) నవీన్ యాదవ్‌తో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రమాణం చేయించారు. స్పీకర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారానికి మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, ఎమ్మెల్యే గణేష్, కాంగ్రెస్ నేతలు, నవీన్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కాగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ బరిలోకి దిగి విస్తృతంగా ప్రచారం చేశారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఎన్నిక జరుగగా.. నవంబర్ 14న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ మొదలు.. ప్రతి రౌండ్‌లోనూ నవీన్ తన ఆధిక్యతను కొనసాగించారు.

చివరకు జూబ్లీహిల్స్ బైపోల్‌లో నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రెండో స్థానంలో నిలువగా.. బీజేపీ డిపాజిట్ కోల్పోయింది.

# బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఫైర్.. బుద్ధి మార్చుకోవాలని హితవు.!



హైదరాబాద్, నవంబర్ 26: రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమంపై బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదంటూ రాష్ట్ర మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆడబిడ్డలు, మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లలోనే చీరలను ఇస్తున్నామని.. దీనిపై బీఆర్ఎస్ నాయకులు కలర్ బాగాలేదని, డిజైన్ బాగాలేదని విమర్శలు గుప్పించడం సరికాదన్నారు.

**కేటీఆర్, హరీశ్ రావులే టార్గెట్‌గా..** ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే హరీశ్ రావులపై తీవ్రంగా ధ్వజమెత్తారు సీతక్క. సహజంగానే ఆడవాళ్లు ఎదుగుతుంటే.. వాళ్లిద్దరూ ఓర్వలేకపోతున్నారన్నారు. ఆడబిడ్డలు చీరలు తీసుకుని ఎంతగానో సంబరపడుతుంటే అవి వాళ్ల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళలు సంతోషంగా ఉండటంతో వారు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గతంలో ఇచ్చినట్టుగా.. తామేమీ సూరత్ నుంచి కిలోల లెక్కన తీసుకురాలేదని, సిరిసిల్ల నేతన్నలు తమ చేతులతో స్వయంగా నేసిన చీరలనే పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. కావాలంటే కేటీఆర్, హరీశ్ రావు, కవితలు.. సిరిసిల్ల వెళ్లి అక్కడి చేనేత కార్మికులను అడిగి వివరాలు తెలుసుకోవచ్చని స్పష్టం చేశారామె. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎంతో నాణ్యతతో కూడిన చీరలను పంచుతుంటే బీఆర్ఎస్ కార్యకర్తలు కావాలనే అవి బాగాలేవని మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలను అవమానించినట్లు అవుతుందన్నారు. చీరల్ని కొందరికే ఇస్తున్నామన్న బీఆర్ఎస్ నేతల ఆరోపణల్ని ఖండించిన మంత్రి.. మహిళా సంఘాల సభ్యులతో పాటు సభ్యత్వంలేని మహిళలనూ సంఘంలోకి ఆహ్వానిస్తూ చీరలు అందజేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఏం చేసినా.. ప్రతిపక్ష నేతలు ఓర్చుకోవడం లేదని ఆమె మండిపడ్డారు. అలాగే ఫ్రీ బస్సు పెడితే బ్రేక్ డాన్స్ చేసుకోవాలని, మహిళలు కొట్టుకుంటున్నారని దుష్ప్రచారం చేశారని ఆమె గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా బుద్ధి మార్చుకుంటే బావుంటుందని సూచించారామె. మహిళలకు మంచి జరుగుతుంటే స్వాగతించడం, సంతోషించడం నేర్చుకోవాలని హితవు పలికారు.

# తెలంగాణలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి: ఎస్ఈసీ



హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు, భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఎస్ఈసీ చర్చించారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. అదనపు డీజీ మహేష్ భగవత్, పంచాయతీ రాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




# ఛత్తీస్‌గఢ్‌లో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. బీజాపూర్ జిల్లాలో ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట బుధవారం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిపై రూ.1.19 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 12 మంది మహిళలు సహా 29 మంది పురుష మావోయిస్టులు ఉన్నారన్నారు. లొంగిపోయిన వారిలో కీలక పీఎల్‌జీఏ ( పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్, వివిధ ఏరియా కమిటీలు, ప్లాటూన్లు, కంపెనీ, మిలీషియా యూనిట్ల సభ్యులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో నుంచి 39 మంది, తెలంగాణ రాష్ట్ర కమిటీ, దమ్తారి.. గరియా బంద్, నువపాడ డివిజన్ సభ్యులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో 790 మంది మావోయిస్టులు ప్రధాన జీవన స్రవంతిలో చేరారని, 1031 మందిని అరెస్టు చేశామని, వివిధ ఎన్‌కౌంటర్లో 202 మంది మావోయిస్టులు మృతి చెందారని ఎస్పీ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com